# తొలివార్త

తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A0357

ప్రజా గళం మా కలం.....

www.tolivaartha.com

www.epaper.tolivaartha.com

ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్ సంపుటి : 02 సంచిక : 169 ఆదివారం 25 - 10 - 2026 వెల : 4/- పేజీలు : 08

Published From : Rangareddy , Circulated at : Hyderabad, Medchal, Malkajgiri, Suryapet, Nalgonda, Jangaon Khammam, Mahaboobnagar, Narayanpet, Warangal , Mancherial



best deal

HEALTH & WEALTH

"అవకాశాలను సృష్టించడం, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించడం."

We create opportunities | 9640707117 (What's up only)


## మహారాష్ట్రతో తుమ్మిడిహట్టి

# బ్యారేజీ ఎత్తుపై చర్చలు



- సోమవారం ముంబయికి సీఎం రేవంత్‌రెడ్డి
- తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపనున్నారు
- సీఎంతో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధికారులు వెళ్లనున్నారు
- 2025 ఏప్రిల్‌లో మేడిగడ్డపై ఎన్‌డీఎస్‌ఏ తుది నివేదిక

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 24 :**

తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు ముహూర్తం ఖరారైంది. సోమవారం ముంబయిలో చర్చలు జరగనున్నాయి. ఇందుకోసం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం ముంబయి వెళ్లనున్నారు. తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అధికారులు పాల్గొనున్నారు.మరోవైపు సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా పడింది. అదేరోజు ముంబయిలో మహారాష్ట్ర సీఎంతో రేవంత్‌రెడ్డి సమావేశం ఉన్నందున వాయిదా వేయాలని తెలంగాణ కోరింది. ఈ విజ్ఞప్తిపై స్పందించిన కేఆర్ఎంబీ సమావేశాన్ని వాయిదా వేశారు. సోమవారం జరగాల్సిన కృష్ణా బోర్డు సమావేశం మంగళవారానికి వాయిదా వేసింది.సాగునీటి ప్రాజెక్టులపై శుక్రవారం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశంలో భాగంగా తుమ్మిడిహెట్టిపై ప్రధానంగా చర్చించారు. 152 మీటర్ల ఎత్తున తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి ఒప్పించేందుకు అవసరమైన - మిగతా 2 లో

## హైదరాబాద్‌కు

# నీటి గండం



- పొదుపుగా వాడాలంటూ లౌడ్‌స్పీకర్లతో ప్రచారం
- ఎల్‌నినో ప్రభావంతో హైదరాబాద్‌లో తీవ్ర నీటి కొరత
- రాష్ట్రంలో 27 శాతం తక్కువ వర్షపాతం నమోదు
- తాగునీటి సరఫరాకే తొలి ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం
- నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమాలకు అధికారుల ఆదేశం

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 24 :**

హైదరాబాద్ నగరాన్ని తీవ్ర నీటి సంక్షోభం ఆందోళనకు గురిచేస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం తగ్గడం, రిజర్వాయర్లలో - మిగతా 2 లో



## సివిల్స్ కోచింగ్ విద్యార్థులకు అండగా తెలంగాణ ప్రభుత్వం

- ఆర్థిక సాయం పెంపు
- సివిల్స్ అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు
- బీసీ స్టడీ సర్కిల్ విద్యార్థుల స్టైఫండ్ రూ. 7 వేలకి పెంపు
- పుస్తకాల ఫండ్ రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు రెట్టింపు

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 24 :**

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న బీసీ విద్యార్థులకు తెలంగాణ - మిగతా 2 లో

## పసిఫిక్ మహాసముద్రంలో తొలిసారి 30 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

- మరింత బలపడుతున్న ఎల్‌నినో!
- అక్టోబర్ 22న నమోదైన చారిత్రక ఉష్ణోగ్రత
- ఎల్‌నినో మరింత బలపడుతోందని డబ్ల్యూఎంఓ అంచనా
- డిసెంబర్ నాటికి గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం
- 2026 నైరుతి రుతుపవనాల్లో సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం
- ఎల్‌నినో ప్రభావం 2027 ఆరంభం వరకు కొనసాగే అవకాశం



**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 24 :**

పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు చారిత్రక గరిష్ఠానికి చేరాయి. ఎల్‌నినో ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో భూమధ్య రేఖకు సమీపంలోని మధ్య పసిఫిక్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు తొలిసారి 30 డిగ్రీల సెల్సియస్ మార్కును దాటాయి. అమెరికా జాతీయ సముద్ర, వాతావరణ పరిపాలనా సంస్థ (ఎన్ఓఏఏ) సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఈ వివరాలను - మిగతా 2 లో



## 46 ఆర్థిక అంశాలపై పార్లమెంటరీ కమిటీ అధ్యయనం

- క్రిప్టో నుంచి ఏఐ వరకు అధ్యయనం
- 2026-27 ఆర్థిక సంవత్సరానికి కీలక అంశాలను ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘం ఎంపిక చేసింది
- క్రిప్టో, ఆర్థిక రంగంలో కృత్రిమ మేధ వినియోగంపై ప్రత్యేకంగా పరిశీలనచనుంది

**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 24 :**

దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన కీలక అంశాలపై పార్లమెంటరీ స్థాయీ సంఘం సమగ్ర అధ్యయనం చేపట్టనుంది. క్రిప్టో ఆస్తులు, ఆర్థిక రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం, కరెన్సీ నిర్వహణ, బ్యాంకింగ్, బీమా, పన్నుల సంస్కరణలు సహా మొత్తం 46 అంశాలను 2026-27 - మిగతా 2 లో

## 'ఇండియా' కూటమి

# ర్యాలీ వద్దు



- నవంబర్ 1న ఢిల్లీలో 'ఇండియా' కూటమి ర్యాలీ
- వాయిదా వేయాలని వ్యాపారుల విజ్ఞప్తి
- దీపావళి సీజన్‌లో రూ.10,000 కోట్ల వ్యాపారం నష్టపోతామని వర్తక సంఘం ఆందోళన
- రామ్‌లీలా మైదానం పరిసరాల్లోని 20 మార్కెట్లపై ర్యాలీ ప్రభావం చూపుతుందని వెల్లడి
- గత నెలలో జరిగిన ర్యాలీల వల్ల రూ. 3,000 కోట్లు నష్టపోయామని ఆవేదన
- నిరసన తెలిపే హక్కు ఉన్నప్పటికీ, పండగ తర్వాత ర్యాలీ నిర్వహించాలని కోరిక

**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 24 :**

ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న 'ఇండియా' కూటమి నిర్వహించ తలపెట్టిన భారీ ర్యాలీని వాయిదా వేయాలని వ్యాపార వర్గాలు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని కోరాయి. దీపావళి పండగ - మిగతా 2 లో



## అల్లూరి జిల్లాలో పేలుడు ప్రమాదం

- ఐదుగురి మృతి
- రోడ్డు పనుల కోసం కొండను పేల్చుతుండగా ఘటన
- ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి
- మృతుల్లో టీచర్, డ్రైవర్, ముగ్గురు కూలీలు

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 24 :**

ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు నిర్మాణ - మిగతా 2 లో




## ఏపీ పరిషత్ పోరుకు పోటెత్తిన నామినేషన్లు

- నువ్వా నేనా అంటున్న టీడీపీ, వైసీపీ
- జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు భారీగా దాఖలైన నామినేషన్లు
- ఎంపీటీసీలకు 51,902, జెడ్పీటీసీలకు 5,724 నామినేషన్లు
- జగన్‌ది 'హిట్ అండ్ రన్' రాజకీయమంటూ విమర్శలు

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 24 :**

ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. పరిషత్ పోరులో పోటీ చేసేందుకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల నుంచి భారీ ఎత్తున స్పందన లభించింది. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఉన్న 659 జెడ్పీటీసీ స్థానాలకు మొత్తం 5,724 నామినేషన్లు, 9,829 ఎంపీటీసీ స్థానాలకు ఏకంగా 51,902 నామినేషన్లు దాఖలయ్యాయి. - మిగతా 2 లో

# షర్మిలకు జగన్ లేఖ



- మేనకోడలి పెళ్లికి బెంగళూరు ఇల్లు వద్దని స్పష్టీకరణ
- చెల్లెలు షర్మిలకు జగన్ రాసిన లేఖను బయటపెట్టిన వైసీపీ
- కుమార్తె పెళ్లి తన బెంగళూరు నివాసంలో వద్దని లేఖలో జగన్ స్పష్టీకరణ
- తీవ్రమైన భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతాయని వివరణ
- ప్రత్యామ్నాయంగా హైదరాబాద్ లోటస్ పాండ్‌ను పరిశీలించాలని సూచన

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 24 :**

వైసీపీ అధినేత జగన్ తన సోదరి షర్మిలకు రాసిన ఓ లేఖను ఆ పార్టీ తాజాగా విడుదల చేసింది. షర్మిల కుమార్తె అంజలి వివాహానికి సంబంధించి అక్టోబర్ 9న రాసిన ఈ లేఖలో, పెళ్లి వేదిక విషయంలో జగన్ తన అభ్యంతరాలను, కారణాలను స్పష్టంగా వివరించారు.మేనకోడలు అంజలి వివాహం జరగనుండటం పట్ల జగన్ తొలుత సంతోషం వ్యక్తం చేశారు. అయితే, ఈ వేడుకను బెంగళూరులోని తన నివాసంలో నిర్వహించాలని షర్మిల కుటుంబం భావిస్తున్నట్లు తెలిసిందని, కానీ అక్కడ ఈ కార్యక్రమం నిర్వహిస్తే తీవ్రమైన భద్రతాపరమైన సమస్యలు ఎదురవుతాయని ఆయన హెచ్చరించారు. - మిగతా 2 లో

## ఏపీలో స్థానిక ఎన్నికల పోరు

# ఆసక్తికరంగా కుటుంబ రాజకీయాలు

- స్థానిక ఎన్నికల్లో కుటుంబ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి
- రక్త సంబంధీకులే పోటీపడుతున్న పరిస్థితులూ నెలకొన్నాయి
- ఒకే కుటుంబం నుంచి వేర్వేరు పదవులకు పోటీ చేస్తూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.
- రెండు ఎంపీటీసీ స్థానాలకు భార్యాభర్తలు పోటీ
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు నామినేషన్లు వేయడం చర్చనీయాంశంగా మారింది



**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 24 :**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కుటుంబ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఈసారి కుటుంబ సభ్యులే పరస్పరం బరిలో నిలిచారు. అన్నదమ్ముళ్లు, అత్తాకోడళ్లు, తోటి కోడళ్లు ఒకరిపై ఒకరు పోటీ పడుతున్నారు. వీరంతా వేర్వేరు పార్టీల తరఫున పోటీ చేస్తూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఒకే కుటుంబానికి చెందిన నలుగురు నామినేషన్లు వేయడం చర్చనీయాంశంగా మారింది.అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలంలోని పడమటికోన ఎంపీటీసీ స్థానం నుంచి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తల్లి సుశీలమ్మ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అదే స్థానానికి శుక్రవారం నాడు మండిపల్లి సతీమణి హరితమ్మ నామపత్రాలు సమర్పించారు. మంత్రి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలుగుదేశం తరఫున జడ్పీటీసీ అభ్యర్థిత్వానికి నామినేషన్ వేయగా వరుసకు సోదరుడైన పి.దేవనాథరెడ్డి వైఎస్సార్సీపీ నుంచి నామినేషన్ వేశారు. పరిశీలన, ఉపసంహరణ తరవాత ఎవరెవరు పోటీలో ఉంటారనే విషయమై నియోజకవర్గంలో ఉత్కంఠ రేపుతోంది. సుశీలమ్మ, హరితమ్మల్లో ఎవరు బరిలో నిలిచినా వారే చిన్నమండెం ఎంపీపీ అభ్యర్థిగా ఉంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.నంద్యాల జిల్లా మిడుతూరు మండలంలోని నాగలూటి ఎంపీటీసీ స్థానానికి ఒకే కుటుంబం నుంచి అత్తాకోడళ్లు - మిగతా 2 లో

# సంపాదకీయం

## విఫల రాష్ట్రం

ఒక రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లకాలంలో ఒక సంక్షోభాన్ని పరిష్కరించలేకపోవడం ఎక్కడా లేదేమో. మణిపూర్‌లో పరిస్థితులు మెరుగుపడటానికి ముందే అవి మరింత దిగజారిపోతూంటాయి. చల్లారిందని అనుకుంటున్న మీతీ--కుకీ ఘర్షణలకు ఇప్పుడు అక్కడ మళ్ళీ తెరలేచింది. మీతీలు లక్ష్యంగా కుకీలు జరిపిన ఒక భీకరదాడిలో ముగ్గురు మరణించారు, అనేకులు గాయపడ్డారు. ఈ దాడి అనంతరం లోయలో నిరసనలు వెల్లువెత్తాయి, నలభై ఎనిమిదిగంటల బంద్ జరిగింది. కొన్నిచోట్ల ఘర్షణలు, పేలుళ్ళు సంభవించాయి, మీతీ సంఘాల హెచ్చరికలతో ప్రజల్లో అభద్రతాభావం పెరిగింది. మూడేళ్లక్రితం మొదలైన హింసలో మూడువందలకుపైగా ప్రాణాలు పోయాయి, 70,000 మంది నిరాశ్రయులైనారు. తీవ్రతలో కాస్తంత తేడావున్నా, అది ఇంకా కొనసాగుతూ, మణిపూర్‌లోని ప్రతి తెగనూ జాతినీ చుట్టుముట్టింది. తాత్కాలిక సరిహద్దులతో రాష్ట్రం జాతులు, మతాల ప్రాతిపదికన ప్రాంతాలుగా విడిపోయింది. శాంతిభద్రతలపై పట్టు సాధించడానికి ఖేమ్‌చంద్ ప్రభుత్వం నానాకష్టాలూ పడుతూంటే, రాష్ట్రంలో ఈ హింసకు మూలకారణమైన మీతీ కుకీల మధ్య ఇప్పుడు మళ్ళీ ఘర్షణ రేగింది. హత్యకు గురైనవారి మృతదేహాలతో మీతీలు ముఖ్యమంత్రి నివాసం ముందు నిరసనలు నిర్వహించి, పాలకుల సమర్థత మీద తమకు నమ్మకం లేదని ప్రకటించారు. మణిపూర్‌లో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం, గవర్నర్ పాలన రెండూ హింసను అరికట్టడంలో విఫలం కావడం విచిత్రం, విషాదం. మాజీ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ ఏలుబడిలో రెండున్నరేళ్ళపాటు రాష్ట్రం మీతీ--కుకీ ఘర్షణలతో మండిపోయింది. ఆయన ప్రోద్బలం మేరకు భద్రతాబలగాలు, మీతీ తీవ్రవాద సంస్థలు కుకీలను ఊచకోత కోశాయి. మీతీల పక్షాన వ్యవహరిస్తూ ఆయన తెగలమధ్య వైరం పెంచుతున్నాడన్న వాస్తవం పలుమార్లు నిరూపణ అయింది. ఈ హింసావలయాన్ని ఛేదించాలంటే నాయకత్వాన్ని మార్చవలసిందేనన్న ఒత్తిడిపెరగడంతో, మరోపక్క బీరేన్‌ను తొలగించేందుకు విపక్షాలు తమ ప్రయత్నాలు ఉధృతం చేయడంతోనూ ఆఖరుక్షణాల్లో రాష్ట్రపతిపాలన విధించి ఆ రాష్ట్రం తమ చేజారిపోకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాపాడుకుంది. మీతీలకు ఆయుధాలు సమకూర్చవలసిందిగా ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న బీరేన్ తన అధికారులకు ఆదేశిస్తున్న ఆడియో ఒకటి బయటకు వచ్చి, సుప్రీంకోర్టు కూడా దానిని ధ్రువీకరించడం బీజేపీ అధిష్ఠానాన్ని ఇరకాటంలో పడవేసింది. బీరేన్‌ను తప్పించి, ఏడాది పాటు రాష్ట్రపతిపాలన అమలు చేసినప్పుడు కూడా రాష్ట్రంలో అరాచకాలు కొనసాగాయి. మీతీయేతర జాతుల్లో బీజేపీ పట్ల అవిశ్వాసం అధికంగా ఉన్న నేపథ్యంలో, సౌమ్యుడిగా, అందరికీ ఆమోదయోగ్యుడుగా పేరున్న ఖేమ్‌చంద్‌ను సీఎం చేసి, నాగా, కుకీల నుంచి ఇద్దరిని ఉపముఖ్యమంత్రులను చేయడంతో రాష్ట్రం గాడినపడవచ్చునన్న అభిప్రాయం కలిగింది. కానీ, ఖేమ్‌చంద్ నాయకత్వంలో నాగా--కుకీ ఘర్షణలు మొదలై, నాలుగునెలల్లోనే తీవ్రస్థాయికి చేరి, ఉపముఖ్యమంత్రులు ఇద్దరూ పరస్పరం ఆరోపణలు చేసుకోవడం ప్రారంభించారు. 20రోజుల క్రితమే అక్కడ సాయుధదళాల ప్రత్యేకాధికారాల చట్టం అమలును మరో ఆర్నెల్లపాటు పొడిగించి, కల్లోలితప్రాంతంగా దాని గుర్తింపును కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మణిపూర్‌ను దారికి తీసుకురావడంలో తాము విఫలం చెందామని పాలకులే ఒప్పుకున్నట్టు దేశానికి అనిపించింది. ఓ పదమూడు పోలీసు స్టేషన్ల పరిధి మినహా మిగతా రాష్ట్రమంతా కల్లోలంగానే ఉందని ఈ నిర్ణయం అర్థం. నాగా--కుకీల మధ్య వరుసబెట్టి సాగుతున్న దాడులు నివారించడం సాధ్యం కాకపోవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చివుండవచ్చు. ఖేమ్‌చంద్ పాలనలో నాగా--కుకీ ఘర్షణలు రేగడం వెనుక కూడా రాజకీయ కుట్రలున్నాయన్న విమర్శను అటుంచితే, బీరేన్ నిష్క్రమణతో తగ్గుముఖం పట్టాయనుకుంటున్న మీతీ--కుకీ ఘర్షణలు ఇప్పుడు మళ్ళీ మొదలుకావడం అత్యంత భయం కొల్పే పరిణామం. అప్పటి మాదిరిగా గ్రామాలకు గ్రామాలు తగలబడటం, మహిళలపై సామూహిక అత్యాచారాలు జరగడం వంటి ఘోరమైన పరిస్థితులు మళ్ళీ తలెత్తకుండా ప్రభుత్వం నిష్పక్షపాతంగా, నిర్దయగా వ్యవహరించడం అవసరం. ఓట్ల లెక్కలను, రాజకీయ అవసరాలను పక్కనబెట్టి, యుద్ధభూమిగా మారిన ఈ రాష్ట్రంలో దేశప్రయోజనాలదృష్ట్యా వ్యవహరించాలి. కేంద్రప్రభుత్వం మణిపూర్‌మీద పూర్తిగా దృష్టినిలిపి ఈ నిత్య సంఘర్షణను అంతం చేయాలి. మణిపూర్‌ను కల్లోలిత ప్రాంతంగా ఉంచడం, కొనసాగించడం ప్రమాదం.

## ‘ఇండియా’ కూటమి ర్యాలీ వద్దు

మొదటిపేజీ తరువాయి - సీజన్‌లో ఈ ర్యాలీ నిర్వహిస్తే సుమారు రూ.10,000 కోట్ల మేర వ్యాపార నష్టం వాటిల్లుతుందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సీటీఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ లేఖ రాశారు. పండగ సీజన్‌ను దృష్ట్యాలో ఉంచుకుని నవంబర్ 10 తర్వాత ర్యాలీని నిర్వహించాలని ఆయన ఆ లేఖలో సూచించారు. నవంబర్ 6న ధంతేరస్, నవంబర్ 8న దీపావళి ఉన్న నేపథ్యంలో కొనుగోళ్ల కోసం ప్రజలు భారీగా మార్కెట్లకు వస్తారని, ఈ సమయంలో ర్యాలీ నిర్వహిస్తే వాణిజ్య కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. దీపావళి పండగ వేళ ఢిల్లీ వ్యాప్తంగా బంగారం, వెండి, ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, గృహోపకరణాలు, డ్రై ఫ్రూట్స్, స్వీట్లు, వాహనాలు, స్థిరాస్తి, గిఫ్ట్ ఆర్టికల్స్ వంటి అన్ని రంగాల్లో కలిపి సుమారు రూ.25,000 కోట్ల మేర వ్యాపారం



జరుగుతుందని సీటీఐ అంచనా వేసింది. రామ్‌లీలా మైదానానికి ఐదు కిలోమీటర్ల పరిధిలోనే చాందినీ చౌక్, సదర్ బజార్ వంటి సుమారు 20 హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లు ఉన్నాయని, ర్యాలీ కారణంగా విధించే ట్రాఫిక్ ఆంక్షలతో ఈ ప్రాంతమంతా స్తంభించిపోయే ప్రమాదం ఉందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత అక్టోబర్ మాసంలో సెంట్రల్ ఢిల్లీలో జరిగిన పలు ర్యాలీలు, రహదారుల మూసివేత వల్ల ఇప్పటికే వ్యాపారులు రూ.3,000 కోట్ల వరకు నష్టపోయారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఓటర్ల జాబితా సవరణలో “ఓట్ల చోరీ” జరిగిందన్న ఆరోపణలతో, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ‘ఇండియా’ కూటమి ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. అయితే, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును తాము గౌరవిస్తామని, పండగ సీజన్ ముగిసే వరకు వాణిజ్య ప్రాంతాలకు దూరంగా ర్యాలీలు నిర్వహించాలని సీటీఐ రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేసింది.

## పసిఫిక్ మహాసముద్రంలో తొలిసారి 30 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

మొదటిపేజీ తరువాయి - వెల్లడించారు. అక్టోబర్ 22న ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రత 30 డిగ్రీలకు చేరినట్లు ‘ఇండియా టుడే’ తెలిపింది. అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం, ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ఉష్ణమండల ప్రాంతాల్లో సముద్ర ఉపరితల జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కే సహజ వాతావరణ పరిణామం. దీనివల్ల సముద్రంపై వీచే గాలులు, మేఘాల కదలికలు, వర్షపాత నమూనాల్లో మార్పులు వస్తాయి. ఈ ప్రభావం పసిఫిక్ ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రపంచంలోని పలు దేశాల వాతావరణంపైనా పడుతుంది. కొన్ని ప్రాంతాల్లో కరవు, అధిక ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉండగా.. మరికొన్ని చోట్ల భారీ వర్షాలు, వరదల ముప్పు పెరుగుతుంది. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) అంచనాల ప్రకారం.. 2026 అక్టోబర్-డిసెంబర్ మధ్య ఎల్‌నినో మరింత బలపడే అవకాశం ఉంది. డిసెంబర్ నాటికి ఇది గరిష్ఠ స్థాయికి చేరవచ్చని అంచనా వేస్తున్నారు. ఎల్‌నినో తీవ్రతను అంచనా వేయడానికి శాస్త్రవేత్తలు ఉపయోగించే నినో 3.4 సూచీలో సముద్ర ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే జూన్‌లో 1.6 డిగ్రీలు, ఆగస్టులో 2.5 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. అక్టోబర్-డిసెంబర్ కాలానికి ఈ వ్యత్యాసం 3.7 డిగ్రీలకు చేరవచ్చని డబ్ల్యూఎంఓ అంచనా వేసింది. ఇది గతంలో నమోదైన గరిష్ఠ స్థాయి కంటే ఎక్కువ. అయితే ఈ సంఖ్యలు సముద్రం వాస్తవ ఉష్ణోగ్రతను కాకుండా, దీర్ఘకాలిక సగటుతో పోలిస్తే ఎంత ఎక్కువగా ఉందో సూచిస్తాయి. భారత్‌పైనా ఈ పరిణామాల ప్రభావం ఉండొచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. 2026లో నైరుతి రుతుపవనాల సీజన్ సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతంతో ముగిసింది. అక్టోబర్-డిసెంబర్ మధ్య దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే దక్షిణ ద్వీపకల్ప ప్రాంతంలో మొత్తం మీద సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని తెలిపింది. ప్రాంతాలవారీగా పరిస్థితులు మారవచ్చని, ఎల్‌నినో ఒక్కటే భారత వాతావరణాన్ని నిర్ణయించదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు, సముద్రాలు ఇప్పటికే అసాధారణంగా వేడెక్కుతున్న నేపథ్యంలో బలమైన ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలను మరింత పెంచే ప్రమాదం ఉందని డబ్ల్యూఎంఓ హెచ్చరించింది. ఈ ప్రభావం 2027 ఆరంభం వరకు కొనసాగవచ్చని అంచనా వేస్తోంది. అయితే దీని తీవ్రత, వర్షపాతంపై ప్రభావం ప్రాంతాన్ని బట్టి మారుతుంది. అందువల్ల రాబోయే నెలల్లో సముద్ర ఉష్ణోగ్రతలు, గాలుల దిశ, వర్షపాత అంచనాలను శాస్త్రవేత్తలు నిరంతరం పరిశీలించనున్నారు.

## మహారాష్ట్రతో తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తుపై చర్చలు

మొదటిపేజీ తరువాయి - పూర్తి వివరాలను సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజినీర్లను సీఎం ఆదేశించారు. గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని, అయితే అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీటిని తెచ్చుకొనే వీల్లేదని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే 152 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు సిద్ధమవుతోంది. అందుకు అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం, ఇతర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచాలని ఇప్పటికే అధికారులకు సూచించారు. మహారాష్ట్రతో చర్చల సందర్భంగా తెలంగాణ నీటి అవసరాలు, వాదనలను సమర్థవంతంగా వివరించనున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రజల కష్టాలకు కారణమైన బీఆర్ఎస్ నేతలే ప్రస్తుతం అబద్ధాలు చెబుతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేవలం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలోనే మేడిగడ్డ బ్యారేజ్ కూలిపోయిందని, కేసీఆర్ తీరు వల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టులను సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో పరిస్థితులు ఉన్నాయని, అయినా రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.‘ ‘మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిర్మాణంలో సీకెంట్ ఫైల్స్ వాడారు. సీకెంట్ ఫైల్స్ వాడకం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో సమస్యలు వచ్చాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో గేట్లు మూయవద్దని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది. బ్యారేజీల గేట్లు మూయకుంటే పంపులు రన్ చేసే అవకాశమే లేదు. కన్నెపల్లి నుంచి నీరు ఎత్తిపోయాలని బీఆర్ఎస్ నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. బ్యారేజీ నిర్మాణానికి ఎంత కాంక్రీట్ అవసరమైందో, అంతే కాంక్రీట్ మరమ్మతులకు అవసరం. ఎల్‌నినో



వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులకు కారణం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు చేసే విషప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరని మంత్రి పేర్కొన్నారు.

## హైదరాబాద్‌కు నీటి గండం

మొదటిపేజీ తరువాయి - నీటిమట్టాలు గణనీయంగా పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. తాగునీటి సరఫరాపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుండటంతో, నీటిని పొదుపుగా వాడుకోవాలని నగరంలోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు పౌరులకు విజ్ఞప్తి చేస్తున్నాయి. మణికొండలోని పంచవటి సాయి లక్ష్మి కాలనీలో ఒక వ్యక్తి సైకిల్‌పై లౌడ్‌స్పీకర్‌తో అవగాహన కల్పిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కార్లు, సెల్లార్లు, రోడ్లు, టెర్రస్‌లు శుభ్రం చేసేందుకు కుళాయి లేదా బోర్ నీటిని వృథా చేయవద్దని ఆయన నినదిస్తున్న తీరు, నగరంలో నెలకొన్న నీటి ఎద్దడి తీవ్రతను కళ్లకు కడుతోంది. రాష్ట్రంలో నెలకొన్న ఈ క్లిష్ట పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా అంగీకరించింది. ఈ ఏడాది సాధారణం కంటే 27 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, ఫలితంగా రాష్ట్రంలోని 621 మండలాలకు గాను 324 మండలాల్లో భూగర్భ జలాలు అట్టడుగుకు పడిపోయాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. కొన్ని రిజర్వాయర్లలో నీటి నిల్వలు 20 శాతం కంటే తక్కువకు చేరుకున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా తెలిపారు. ప్రస్తుత తరుణంలో సాగునీటి కంటే ప్రజలు, పశువులు, ఇతర జీవరాశుల తాగునీటి అవసరాలకే ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని జలాశయాల్లో 30 నుంచి 40 శాతం మేర నీటి నిల్వలు ఉన్నాయని, 2027 జూలై వరకు తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడటమే తమ ప్రథమ కర్తవ్యమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు, నీటి పొదుపు ఆవశ్యకతపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. నీటి సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక టోల్-ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

## సివిల్స్ కోచింగ్ విద్యార్థులకు అండగా తెలంగాణ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి - ప్రభుత్వం శుభవార్త చెప్పింది. హైదరాబాద్‌లోని సైదాబాద్ బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న 100 మంది అభ్యర్థులకు అందించే ఆర్థిక సాయాన్ని గణనీయంగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. పెంచిన మొత్తాలను వచ్చే నెల నుంచే అమలు చేయనున్నట్లు ప్రకటించింది. వివరాల్లోకి వెళితే, సివిల్స్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు ఇప్పటివరకు



నెలకు రూ.5,000గా ఉన్న స్టైఫండ్‌ను రూ.7,000కు పెంచారు. అదేవిధంగా, పుస్తకాల కొనుగోలు కోసం ఒకేసారి ఇచ్చే బుక్ ఫండ్‌ను రూ.5,000 నుంచి ఏకంగా రూ.10,000కు రెట్టింపు చేశారు. ఈ పెంచిన మొత్తాలను విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తెలిపారు. ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం సైదాబాద్ కేంద్రంలో 100 మంది విద్యార్థులకు మూడేళ్ల సమగ్ర సివిల్స్ శిక్షణ అందిస్తున్నామని, మరో 100 మందికి ఇతర పోటీ పరీక్షల కోసం ఫౌండేషన్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నామని హరికృష్ణ పేర్కొన్నారు. అభ్యర్థులు ప్రైవేట్ స్టడీ హాళ్ల కోసం డబ్బు వృథా చేయకుండా, స్టడీ సర్కిల్ లైబ్రరీ వేళలను కూడా పొడిగించినట్లు తెలిపారు. ఇకపై లైబ్రరీ ఉదయం 7 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఏపీలో స్థానిక ఎన్నికల పోరు

మొదటిపేజీ తరువాయి - పోటీ చేస్తున్నారు. వైఎస్సార్సీపీ తరఫున అత్త బిపాషా పోటీ పడుతుండగా అదే స్థానానికి మరిది కోడలైన షాహీన్ తెలుగుదేశం తరఫున పోటీ పడుతున్నారు. షాహీన్ గురువారం నామినేషన్ వేయగా, అత్త బిపాషా శుక్రవారం నామపత్రాలు దాఖలు చేశారు. శ్రీకాకుళం జిల్లాలో కంచిలి మండలంలో తెలుగుదేశం తరఫున రెండు ఎంపీటీసీ స్థానాలకు భార్యాభర్తలు పోటీచేస్తున్నారు. కొక్కిలిపుట్టుగ ప్రాదేశికానికి మాదిన రామారావు, శ్రీరాంపురం స్థానానికి మాదిన విమల శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆమదాలవలస మండలంలో కలివరం ఎంపీటీసీ స్థానానికి తోటి కోడళ్లు బరిలో నిలిచారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పెద్దన్నయ్య తమ్మినేని విజయవర్ధన్‌రావు భార్య శారద వైఎస్సార్సీపీ తరఫున ఎంపీటీసీ స్థానానికి నామపత్రాలు సమర్పించారు. రెండో అన్నయ్య తమ్మినేని శ్యామలరావు భార్య, మాజీ ఎంపీపీ భారతి తెలుగుదేశం నుంచి బరిలో నిలిచారు. వీరి కుమార్తె తమ్మినేని సుజాత ఆమదాలవలస జడ్పీటీసీ అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు.

## షర్మిలకు జగన్ లేఖ

మొదటిపేజీ తరువాయి - భద్రత, వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన అంశాలను విస్మరించవద్దని షర్మిలను కోరారు. బెంగళూరులోని ఇల్లు తన కుటుంబ నివాసమని, అక్కడ తాము సురక్షితంగా ఉండాల్సిన అవసరం ఉందని జగన్ నొక్కిచెప్పారు. తన సొంత పిల్లల వివాహం విషయంలో కూడా భద్రత దృష్ట్యా తాను ఇలాంటి నిర్ణయమే తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ విషయంలో తన ఇబ్బందులను ఇప్పటికే కొందరి ద్వారా తెలియజేసినా, తన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకపోవడం బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన పరిస్థితిని అర్థం చేసుకొని, దయచేసి మరో వేదికను ఎంచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అవసరమైతే హైదరాబాద్‌లోని లోటస్ పాండ్ లోనైనా వివాహం జరుపుకోవచ్చని సూచించారు. అంజలి వివాహ ఏర్పాట్లకు సంబంధించి జరుగు తున్న చర్చల నేపథ్యంలో, జగన్ వైఖరిని స్పష్టం చేసేందుకే వైసీపీ ఈ లేఖను విడుదల చేసినట్లు తెలుస్తోంది.

## ఏపీ పరిషత్ పోరుకు పోటెత్తిన నామినేషన్లు

మొదటిపేజీ తరువాయి - నామినేషన్ల చివరి రోజున అత్యధికంగా జెడ్పీటీసీలకు 3,315, ఎంపీటీసీలకు 25,016 నామినేషన్లు రావడం ఎన్నికల వేడిని సూచిస్తోంది. నామినేషన్ల దాఖలులో అధికార, ప్రతిపక్ష పార్టీలు నువ్వా నేనా అన్నట్లు పోటీపడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ స్థానాలకు టీడీపీ తరఫున అత్యధికంగా 22,013 నామినేషన్లు దాఖలు కాగా, వైసీపీ నుంచి 20,556 మంది నామినేషన్లు వేశారు. ఇక జనసేన పార్టీ తరఫున 4,609 మంది, బీజేపీ నుంచి 1,150 మంది తమ అభ్యర్థిత్వాలను నమోదు చేసుకున్నారు. అదేవిధంగా, జెడ్పీటీసీ స్థానాలకు కూడా ప్రధాన పార్టీల మధ్య గట్టి పోటీ నెలకొంది. టీడీపీ తరఫున 2,078 నామినేషన్లు దాఖలు కాగా, వైఎస్ఆర్సీపీ నుంచి 1,815 మంది బరిలో నిలిచారు. కూటమిలోని జనసేన పార్టీ నుంచి 679 మంది, బీజేపీ తరఫున 255 మంది నామినేషన్లు వేశారు. ఇంత భారీ సంఖ్యలో ప్రజాస్వామ్యబద్ధంగా నామినేషన్లు దాఖలైనప్పటికీ, కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అధికార పార్టీ నేతలు మండిపడుతున్నారు. జగన్ తీరును ‘హిట్ అండ్ రన్’ థియరీగా వారు అభివర్ణిస్తున్నారు. కేవలం ప్రెస్ మీట్లు పెట్టడానికే బెంగళూరు నుంచి అమరావతికి వస్తున్నారని, నిరాధార ఆరోపణలు చేసి తిరిగి వెళ్లిపోతున్నారని కూటమి పార్టీల నేతలు విమర్శిస్తున్నారు. క్షేత్రస్థాయి వాస్తవాలను గమనించకుండా జగన్ వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. మొత్తం మీద నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో పరిషత్ ఎన్నికల రాజకీయం మరింత వేడెక్కింది.

## అల్లూరి జిల్లాలో పేలుడు ప్రమాదం



మొదటిపేజీ తరువాయి - పనుల కోసం కొండను పేల్చే క్రమంలో జరిగిన పేలుడులో ఐదుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. అనంతగిరి మండలం పినకోట సమీపంలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కొండను తొలగించేందుకు కార్మికులు జిలెటిన్ స్టిక్స్‌ను ఉపయోగించి పేలుడుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో అటుగా వస్తున్న ఓ టిప్పర్ లారీ పేలుడు ధాటికి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఒక టీచర్, టిప్పర్ డ్రైవర్‌తో పాటు ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతులను టీచర్ సునీత (వైజాగ్), మణి (దేవరాపల్లి), నారాయణ రావు (చీడకాడ), పవన్ కుమార్ (కడప)గా గుర్తించారు. మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## 46 ఆర్థిక అంశాలపై పార్లమెంటరీ కమిటీ అధ్యయనం

మొదటిపేజీ తరువాయి - ఆర్థిక సంవత్సరంలో పరిశీలనకు ఎంపిక చేసింది. ఈ అంశాలపై అధ్యయనం చేసి నివేదికలు సిద్ధం చేయనున్నట్లు లోక్‌సభ బులెటిన్ వెల్లడించింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ నెల ప్రారంభంలో వివిధ మంత్రిత్వ శాఖలకు సంబంధించిన పార్లమెంటరీ కమిటీలను పునర్వ్యవస్థీకరించారు. ఈ క్రమంలో ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘానికి బీజేపీ ఎంపీ భర్తృహరి మహతాబ్‌ను మరోసారి ఛైర్మన్‌గా నియమించారు. ఈ కమిటీలో లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులు ఉన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక వ్యవహారాలు, వ్యయం, ప్రభుత్వ రంగ సంస్థలు, పెట్టుబడులు-ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, రెవెన్యూ, ఆర్థిక సేవల విభాగాలతో పాటు మరికొన్ని కీలక సంస్థలకు సంబంధించిన అంశాలను కమిటీ పరిశీలించనుంది. ధరల స్థిరత్వం, రూపాయి విలువ, ఆర్థిక నియంత్రణ వ్యవస్థలు, ప్రభుత్వ ఆస్తుల వినియోగం వంటి అంశాలపైనా కమిటీ దృష్టి సారించనుంది. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్, గణాంకాలు-కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖలకు సంబంధించిన అంశాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఆయా రంగాల్లో విధానాల అమలు, పనితీరు, సంస్కరణల అవసరాన్ని అంచనా వేయడం ఈ అధ్యయనాల ప్రధాన ఉద్దేశం. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో వర్చువల్ డిజిటల్ ఆస్తులపై కమిటీ ప్రత్యేకంగా అధ్యయనం చేయనుంది. క్రిప్టో ఆస్తులకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులు, వాటి భవిష్యత్తు, ఈ రంగంలో అనుసరించాల్సిన విధానాలపై పరిశీలన చేపట్టనుంది. ఆర్థిక రంగంలో కృత్రిమ మేధ వినియోగం వల్ల కలిగే అవకాశాలు, ఎదురయ్యే సమస్యలను కూడా అధ్యయనం చేయనుంది. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, డిజిటల్ లావాదేవీలు వంటి విభాగాల్లో కొత్త సాంకేతికత వినియోగం పెరుగుతున్నందున సంబంధిత అంశాలపై సమగ్ర విశ్లేషణకు ప్రాధాన్యత ఇవ్వనుంది. అదే సమయంలో ఆర్థిక రంగంలో నియంత్రణ వ్యవస్థల పనితీరు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) రంగంలో ఉన్న నియంత్రణ లోపాలను పరిశీలించనుంది. ఈ రంగాల్లో తగిన పర్యవేక్షణ, పారదర్శకతకు సంబంధించిన అంశాలపై కూడా నివేదిక రూపొందించనుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో ధరల స్థిరత్వం, కరెన్సీ



నిర్వహణ కీలక పాత్ర పోషిస్తాయి. వీటికి సంబంధించి అనుసరిస్తున్న వ్యూహాలు, ఎదురవుతున్న సవాళ్లను కమిటీ సమీక్షించనుంది. మారుతున్న స్థూల ఆర్థిక పరిస్థితులను విశ్లేషించడంతో పాటు భారతీయ రిజర్వు బ్యాంకు పాత్రను కూడా పరిశీలించనుంది. చిన్న మొత్తాల పొదుపు పథకాల పనితీరు, ఆర్థిక వ్యవస్థలో వాటి ప్రాధాన్యం వంటి అంశాలపై అధ్యయనం చేపట్టనుంది. ప్రభుత్వ రంగ ఆస్తుల నగదీకరణ ద్వారా వనరులను సమర్థంగా వినియోగించుకునే విధానాలనూ పరిశీలించనుంది. ఇక బ్యాంకింగ్, పెన్షన్, ఆరోగ్య బీమా రంగాల పనితీరుతో పాటు అసంఘటిత రంగంలోని కార్మికులకు సామాజిక భద్రత కల్పించే అంశాలపైనా కమిటీ దృష్టి సారించనుంది. కేంద్ర ప్రభుత్వ వివిధ పథకాల అమలు, ఫలితాలను సమీక్షించనుంది. పన్నుల విధానంలో మార్పులు, సంస్కరణలకు సంబంధించిన అంశాలు కూడా కమిటీ పరిశీలనలో ఉన్నాయి. కస్టమ్స్ సుంకాలు, వస్తు-సేవల పన్ను (జీఎస్టీ), ప్రత్యక్ష పన్నుల వ్యవస్థల్లో చేపట్టాల్సిన మార్పులపై అధ్యయనం చేయనుంది. పన్నుల విధానాలు ఆర్థిక కార్యకలాపాలు, ప్రభుత్వ ఆదాయంపై చూపే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని సంస్కరణల అవసరాన్ని అంచనా వేయనుంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) పనితీరును కూడా సమీక్షించనుంది. ఆర్థిక మార్కెట్ల నియంత్రణ, పెట్టుబడిదారుల ప్రయోజనాల పరిరక్షణ వంటి అంశాలు ఈ పరిశీలనలో ప్రాధాన్యం పొందే అవకాశం ఉంది. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలో జాతీయ కంపెనీ చట్ట ట్రైబ్యునల్ ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై కమిటీ అధ్యయనం చేయనుంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత, కంపెనీల ఈ-గవర్నెన్స్, ఆడిటర్ల జవాబుదారీతనం వంటి అంశాలను కూడా పరిశీలించనుంది. కంపెనీల పాలనలో పారదర్శకత, బాధ్యతాయుత నిర్వహణను మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ అధ్యయనాలు ఉపయోగపడే అవకాశం ఉంది. రంగాలవారీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో నీతి ఆయోగ్ పాత్రను కమిటీ పరిశీలించనుంది. వెనుకబడిన జిల్లాల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్న ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమం పనితీరును కూడా సమీక్షించనుంది. గణాంకాలు -కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ పరిధిలో జాతీయ ఖాతాల గణాంకాలపై అధ్యయనం చేపట్టనుంది. దేశ ఆర్థిక పరిస్థితిని అంచనా వేయడానికి అవసరమైన గణాంకాల సేకరణ, విశ్లేషణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించనుంది.

## ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ల నమోదు
## కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనాలి

### డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల పిలుపు



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 24 ( తొలివార్త ):** పాల్వంచ మండలంలోని కెటిపిఎస్ అంబేద్కర్ సెంటర్లో కర్మాగారా గ్రాడ్యుయేట్ల ఓటర్ల నమోదు ప్రారంభం,ఓటర్ల నమోదు కార్యక్రమంలో పాల్గొన్న కొత్వాల. నల్లగొండ-వరంగల్-ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల, నమోదు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చురుగ్గా పాల్గొని, ఓటర్ల నమోదును చేపించాలని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావుఅన్నారు. పాల్వంచ కె.టి.పి.ఎస్ అంబేద్కర్ సెంటర్లో 2వ డివిజన్ కార్పొరేటర్ మాలంపాటి భవిత, కాంగ్రెస్ నాయకులు మాలంపాటి కిరణ్ ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఓటర్ల నమోదు శిబిరంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,నాయకత్వంలో సుమారు 70 వేల నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,మంచి విద్యా వేత్త అనీ, ఆయనను గెలిపించడానికి కాంగ్రెస్ శ్రేణులు, కంకణ బదులు కావాలన్నారు. పాల్వంచ పట్టణంలో డివిజన్ల వారీగా కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి గ్రాడ్యుయేట్లను గుర్తించాలన్నారు. గుర్తించిన గ్రాడ్యుయేట్ల ఓటర్ల నమోదు చేసేలా కృషి చేయాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొండం వెంకన్నగౌడ్, మాలంపాటి కిరణ్, యం. శ్రీనివాసరావు, భూక్యా ఘాన్సీ, మిరియాల నాగరాజు, తిప్పిరెడ్డి మధుసూదన్ రెడ్డి, నల్లమోతు పవన్, పెటేటి నరేష్, కె.లక్ష్మణ్ తదితరులు, పాల్గొన్నారు.

## టిఎక్స్ హాస్పిటల్ లో ఆచార్య డాక్టర్
## మద్దెల శివకుమార్ ని పరామర్శించిన

### మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 24 ( తొలివార్త ):** భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అనారోగ్యంతో బాధపడుతూ బంజారాహిల్స్ లోని టి ఎక్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా వారిని పరామర్శించి ఆరోగ్యపరిస్తితిని అడిగితెలుసుకున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి చెన్నయ్య రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి మరిపల్లి శ్రీకాంత్, సోషల్ మీడియా కన్వీనర్ జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులపై...
## కూలీలతో ముఖా...ముఖిగా... మాట్లాడిన

### డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 24 ( తొలివార్త ):** అశ్వాపురం మండలంలోని మొండికుంట, గ్రామపంచాయతీ పరిధిలోని బి.జి. కొత్తూరు గ్రామంలో శనివారం నాడు పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ, పర్యటించారు. ఈ సందర్భంగా,ఆమె, వీ బిజీ రాం-జీ పథకం కింద ఉపాధి హామీ కూలీలకు కల్పిస్తున్న 125 రోజుల పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్, ముఖా...ముఖిగా.. వారితో మాట్లాడి, పథకం అమలు తీరు, పనుల కల్పన, కూలీలకు అందుతున్న ఉపాధి అవకాశాల గురించి ఆరా తీశారు.ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పని కల్పించడం, వారి జీవనోపాధికి తోడ్పడటం వంటి అంశాలపై, సంబంధిత శాఖ అధికారులతో చర్చించారు. క్షేత్రస్థాయిలో పనుల నిర్వహణకు సంబంధించిన వివరాలను తెలుసుకుంటూ,కూలీల అభిప్రాయాలను సేకరించారు. పథకం అమలులో కూలీలకు ఎదురవుతున్న సమస్యలు, పనులకు సంబంధించిన అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఈ పర్యటన చేపట్టారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) అనూష, అశ్వాపురం ఎంపీడీవో ముత్యాలరావు, మొండికుంట గ్రామ సర్పంచ్ మర్రి సంధ్య మల్లారెడ్డి, ఉపసర్పంచ్ చలమల్ల శివకుమార్, వి బి జి,రాం -జీ ఏపీవో సీతారామయ్య, సాంకేతిక సహాయకులు (టీఏలు), ఫీల్డ్ అసిస్టెంట్లు (ఎఫ్ఏలు), గ్రామపంచాయతీ కార్యదర్శి ఎం. సంధ్యారాణి, ఉపాధి హామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి

### భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ పిలుపు




**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 24 ( తొలివార్త ):** భద్రాచలం పట్టణ కేంద్రంలో కార్యాలయం నందు విలేకరుల సమావేశంలో, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ మాట్లాడుతూ,ఖమ్మం వరంగల్ నల్గొండ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హత ఉన్న ప్రతి గ్రాడ్యుయేట్, తప్పనిసరిగా ఓటరుగా నమోదు,చేసుకోవాలని,సర్పంచ్ పూనెం కృష్ణ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకు నేందుకు అర్హులైన గ్రాడ్యుయేటర్లు, వచ్చే నెల నవంబరు 6 చివరి తేదీ అర్హులైన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఎన్నికల ప్రక్రియలో పట్టబద్రుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు దాన్ని బాధ్యతగా వినియోగించుకోవాలని, ఖమ్మం వరంగల్ నల్గొండ జిల్లాలలో, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి, గా, పోటీలో నిలబడ్డ రాం రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ని గెలిపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచ్ పూనెం కృష్ణ కోరారు. అదేవిధంగా,ఉన్నత విద్యను పూర్తి చేసిన పట్టభద్రులు తమ ఓటు హక్కును ఫాం -18 ద్వారా 2023 నవంబర్ నాటికి డిగ్రీ,లేదా దానికి సమానమైన డిప్లొమా పూర్తి చేసిన వారు ఓటరుగా నమోదు వచ్చే నెల నవంబర్ 6 తేదీ లోగా దరఖాస్తు చేసు కోవాలని ఆయన పేర్కొన్నారు.ఓటర్ ఐడి కార్డు,ఆధార్ కార్డు,డిగ్రీ / గ్రాడ్యుయేషన్ సర్టిఫికే ట్,పాస్పోర్ట్ సైజ్ ఫోటో,మొబైల్ నంబర్ తో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తూ ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పట్టభద్రులకు సర్పంచ్ పూనెం కృష్ణ విజ్ఞప్తి చేశారు.

## రైతు వేదికలో పంచాయతీరాజ్
## అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన

### పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 24 ( తొలివార్త ):** అశ్వాపురం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం నందు గల రైతు వేదికలో అశ్వాపురం, మణుగూరు మండలాల పంచాయతీరాజ్ అధికారులతో శనివారం, పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ,తో,పాటు జిల్లా అధికారిని డీపీఓ అనూష సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అశ్వాపురం, ఎంపీఓ ముత్యాలరావు, మణుగూరు మండలం ఎంపీఓ వెంకటేశ్వరరావు తో పాటు రెండు మండలాల పంచాయతీ అధికారులు, సంబంధిత శాఖ అధికారులు కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ కాంగ్రెస్ లో సంస్థాగత బలోపేతంపై దృష్టి

### 20 వార్డుల్లో నూతన కమిటీలు
### త్వరలో బూత్ కమిటీల ఏర్పాటు
### మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి





**చౌటుప్పల్, అక్టోబర్ 24 ( తొలివార్త ):** చౌటుప్పల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ఆ పార్టీ నాయకత్వం కార్యాచరణకు సిద్ధమైంది. చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణంపై కీలకంగా చర్చించారు.మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు,త్వరలోనే బూత్ కమిటీల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.ప్రతి వార్డులో పార్టీకి బలమైన నాయకత్వాన్ని నిర్మించి,బూత్ స్థాయి నుంచి పార్టీ శ్రేణులను సమన్వయంతో ముందుకు నడిపించడంపై దృష్టి సారించారు.రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని,పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు,కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్,మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్,బ్లాక్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి,సింగిల్ విండో చైర్మన్ ఈదుదుల మస్తాన్ బాబు యాదవ్,సింగిల్ విండో వైస్ చైర్మన్ శివారెడ్డి,మాజీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహా గౌడ్,మున్సిపల్ కౌన్సిలర్లు,కో-ఆప్షన్ సభ్యులు,మాజీ కౌన్సిలర్లు,సింగిల్ విండో డైరెక్టర్లు,కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షులు,మాజీ సర్పంచులు,మార్కెట్ డైరెక్టర్లు,రామాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి,చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ ప్రధాన కార్యదర్శులు ఇప్ప వెంకటేష్, ఎర్రగోని లింగస్వామి యాదవ్,ఉపాధ్యక్షులు వెంకట్ కుమార్,అంతటి విజయలక్ష్మి బాలరాజు,చెరుకు లింగస్వామి,బండమీది మల్లేష్,ఎండి వహీద్,అధికార ప్రతినిధి శ్యామకూర యాదయ్య, కార్యదర్శులు మాదాని గోపాల్,గుండబోయినసునిత ఐలయ్య యాదవ్,ఓర్సు శ్రీజా రాజు,ఎండి ఫరోజ్,దుబ్బాటి దయాకర్ రెడ్డి,బత్తుల రాజు,జక్కర్తి సుధా,సుమతి,కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు,ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మనుబోతులగూడెం,వేములూరు గ్రామాలకు మొబైల్ ఫోన్ టవర్ల ద్వారా సిగ్నల్ అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

### సర్పంచ్ పవన్ కుమార్



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 24 ( తొలివార్త ):** అశ్వాపురం మండల పరిధిలోని మనుబోతులపాడు (గూడెం) గ్రామపంచాయతీ సర్పంచ్, పోడియం పవన్ కుమార్, విలేకరులతో మాట్లాడుతూ, మనుబోతుల గూడెం వేములూరు గ్రామాలకు మొబైల్ ఫోన్ టవర్లు, ద్వారా జియో మరియు బిఎస్ఎన్ఎల్ ఎయిర్టెల్ నెట్వర్క్, సెల్ఫోన్,లకు, సంబంధించిన, నెట్ వర్క్ అందేలా, మారుమూల గ్రామమైన మనుబోతుల గూడెం వేములూరు గ్రామాలలో మొబైల్,టవర్లను ఏర్పాటు చేయాలని, ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్థానిక సర్పంచ్ పోడియం పవన్ కుమార్, అధికారులను కోరారు. ఈ సందర్భంగా, సర్పంచ్ పవన్ కుమార్ మాట్లాడుతూ,అడవి ప్రాంతంలో, స్థిరనివాసముగా మనుబోతుల గూడెం వేములూరు మారుమూల గ్రామాలలో మొబైల్ ఫోన్లకు సరైన సిగ్నల్,అందక, తల్లిదండ్రులు,హాస్టల్లో చదువుతున్న విద్యార్థులు,తో, ఫోన్లో మాట్లాడాలన్నా, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అదేవిధంగా, ఉద్యోగాల కొరకు దరఖా దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు, సరైన సమాచారం తెలియకపోవడం, మొబైల్ ఫోన్లకు, మెసేజ్లు రాకపోవడం ఇబ్బందికరంగా మారిందని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎవరైనా జ్వరాల బారిన,పడ్డ, పొలం పనులు చేస్తున్న వ్యవసాయ రైతులు మరియు కూలీలు పాము,తేలు,లు కాటుకి, ప్రమాదవశాత్తు గురైన ఏదైనా జరగరాని సంఘటనలు జరిగిన ప్రభుత్వ వైద్యాధికారులకు గాని 108 అంబులెన్స్ కి సమాచారం, అందించాలన్న మారుమూల గ్రామాలలో ఉన్న ప్రజలు వాడుతున్న మొబైల్ ఫోన్ లకు సరైన నెట్, వర్క్, సిగ్నల్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సర్పంచ్, పోడియం పవన్ కుమార్ విలేకరులకు తెలిపారు. వివిధ శాఖల ప్రభుత్వ అధికారులకు సెల్ ఫోన్ ద్వారా, సమాచారం తెలియపరచాలన్న, అశ్వాపురం మండల కేంద్రానికి గాని లేదా మణుగూరు మండలానికి సుమారు 25 కిలోమీటర్ల మేర మారుమూల గ్రామాలలో అడవి ప్రాంతంలో స్థిరనివాసముగా ఉంటూ జీవనోపాధి చేసుకుని బ్రతుకుచున్న, ప్రజలు తీవ్ర ఇబ్బందులు, పడుతున్నారని సర్పంచ్ పవన్ కుమార్ తెలిపారు.అదేవిధంగా, వి బి, జి, రాం,జీ, పథకం, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన,ఆన్లైన్ విధానం, అమలు చేయడం, వలన, పనిచేస్తున్న వంద రోజుల, ఉపాధి హామీ పథకం పనులకు వెళుతున్న కూలీలకు సెల్ ఫోన్ లో, కూలీలకు హాజరు నమోదు, చేయాలన్న, పనిచేసిన కూలీలకు ఫోటో క్యాప్చర్, చేయడం గాని, ఆన్లైన్ డేటా, అప్డేట్, నమోదు చేయడం, అత్యంత అవసరం, కాబట్టి, మను బోతులగూడెం, వేములూరు గ్రామాలలో, కొంత దూర ప్రాంతంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రదేశంలో, మొబైల్ ఫోన్లకు, నెట్వర్క్ సిగ్నల్, అందకపోవడంతో ఆన్లైన్లో, డౌన్లోడ్,చేయాలన్న అప్డేట్, చేయాలన్న ఫోటోలు,తీసి క్యాప్చర్ చేయడం సిస్టంలో అప్లోడ్ చేయడం సాధ్యపడట్లేదని అధికారులు, తక్షణమే స్పందించి, గ్రామాలలో మొబైల్ ఫోన్ టవర్లకు నెట్వర్క్ అందేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సర్పంచ్, పొడియం,పవన్,కుమార్,తెలియపరిచారు. ఉపాధి హామీ పనులు,చేస్తున్న ప్రదేశంలో మొబైల్ ఫోన్లకు, సరైన సిగ్నల్ అందక పోవడం వలన వారికి తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ఉపాధి హామీ కూలీలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు.దీని,పరిణామాత్మకంగా ఉపాధి హామీ పనుల దైనందున విధి,నిర్వహణలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. పనిచేసిన ఉపాధి కూలీలకు సంబంధిత వివరాలు అప్లోడ్ కాకపోవడం వల్ల కూలీలకు వేతనాలు చెల్లింపు,ఆలస్యం,అవుతుందని ఫీల్డ్ అసిస్టెంట్ సంబంధిత ఫీల్డ్ సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారని, పవన్ కుమార్ పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వాధికారులు మరియు సంబంధిత టెలికాం శాఖ సెల్ ఫోన్ టవర్లు నెట్వర్క్ సంబంధిత సర్వీస్ ప్రొవైడర్లతో సంప్రదించి తగిన చర్యలు చేపట్టి మనుబోతుల గూడెం వేములూరు గ్రామాల ప్రజలకు ఉపాధి హామీ పనుల కూలీలకు గాని డిజిటల్ సేవలు, అందించే విషయంలో సంబంధిత శాఖ అధికారులు స్పందించి తక్షణమే, మొబైల్ ఫోన్ టవర్లకు నెట్వర్క్ పెంచి, ప్రత్యేకంగా ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని సేవలు అందేలా చొరవ చూపాలని మనబోతుల గూడెం గ్రామ సర్పంచ్ పోడియం పవన్ కుమార్ ను సంబంధిత శాఖ అధికారులను కోరారు.

## సైబరాబాద్ లోని జగద్గిరిగుట్ట పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఒక ప్రమాదకర నేరస్థుడిపై పీడీ (పీడీ ) చట్టం ప్రయోగం



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 24 ( తొలివార్త ):ప్రతి నిధి.** సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐ.పి.ఎస్., నాగారాజు రఘు వర్మ అలియాస్ నాగారాజు కార్తికేయ రఘు వర్మ అలియాస్ వంశీ అలియాస్ అల్లూరి విజయ రామ్ అలియాస్ కల్నల్ కార్తికేయ సింగ్ అనే ప్రమాదకరమైన, కుఖ్యాతి చెందిన నేరస్థుడిపై 'పీడీ చట్టం' (ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్ ) ప్రయోగించారు. ఇతను భవిష్యత్తులో మరిన్ని నేరాలకు పాల్పడకుండా నిరోధించే ఉద్దేశంతో, ఇతనిని 'గూండా'గా పరిగణించి, మేడ్చల్ జిల్లాలోని చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు.ఈ నేరస్థుడు ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందినవాడు. హైదరాబాద్‌కు వలస వచ్చిన ఇతను, మొదట్లో డ్రైవర్‌గా పనిచేశాడు. ఆ తర్వాత, సులభంగా డబ్బు సంపాదించి విలాసవంతమైన జీవితాన్ని గడపాలనే ఉద్దేశంతో నేరాల బాట పట్టాడు. ఇతను పోలీసు అధికారిగా నటిస్తూ, బాధితులపై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని నమ్మించి వారిని మోసం చేసేవాడు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భయపెట్టి, కేసుల నుండి కాపాడతామని చెప్పి డబ్బులు వసూలు చేసేవాడు. అంతేకాకుండా, వ్యక్తులను కిడ్నాప్ చేసి, తుపాకులు చూపించి వారి వద్ద ఉన్న నగదును దోచుకునేవాడు. 2017 నుండి 2026 మధ్య కాలంలో, ఇతను మోసం, కిడ్నాప్, దోపిడీ, బలవంతపు వసూళ్లు (ఎక్స్‌టార్షన్ ), నేరపూరిత బెదిరింపులు మరియు 'ఆర్మ్స్ యాక్ట్, 1959' (ఆయుధ చట్టం) కింద నమోదైన మొత్తం 14 నేరాల్లో నిందితుడిగా ఉన్నాడు. గతంలో కూడా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2021 మరియు 2024 సంవత్సరాల్లో ఇతనిపై పీడీ చట్టాన్ని ప్రయోగించారు. అయితే, జైలు నుండి విడుదలైన తర్వాత కూడా ఇతను తన నేరపూరిత కార్యకలాపాలను కొనసాగించాడు. పోలీసు అధికారిగా నటిస్తూ కిడ్నాప్, బలవంతపు వసూళ్లు మరియు దోపిడీకి సంబంధించిన మరో నాలుగు కేసుల్లో ఇతను నిందితుడిగా ఉన్నాడు.తాజా కేసులకు సంబంధించి, సైబరాబాద్‌లోని జగద్గిరిగుట్ట పోలీసులు ఇతనిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. గతంలో తీసుకున్న నివారణ చర్యలు (పీడీ చట్టం) ఉన్నప్పటికీ, ఇతను పదేపదే నేరాలకు పాల్పడుతుండటాన్ని పరిగణనలోకి తీసుకున్న అధికారులు, మరోసారి ఇతనిపై పీడీ చట్టాన్ని ప్రయోగించి జైలులో ఉంచారు. అపరాధిపేరు మరియు చిరునామా:నాగరాజు రఘు వర్మ నాగరాజు కార్తికేయ రఘు వంశీ అల్లూరి విజయ రామ్ కల్నల్ కార్తికేయ సింగ్, s/o నాగరాజు పద్మనాభరాజు పెద్దరాజు, వయస్సు: 29 సంవత్సరాలు, ఆంధ్ర ప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా, పోడూరు మండలం, స్వస్థలం.

## ఎల్‌నినోపై రైతులకు భరోసా ఇవ్వాలి.. రాజకీయ విమర్శలు తగవు

### రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రాధాన్యం.. ఎల్‌నినో ప్రభావాలపై సీఎం నిరంతర పర్యవేక్షణ
### బీఆర్ఎస్ రైతులకు సూచనలు ఇవ్వకుండా ప్రభుత్వంపై విమర్శలకే పరిమితం కావడం సరికాదు: ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**భువనగిరి, అక్టోబర్ 24 ( తొలివార్త ):** ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్.. వ్యవసాయ రంగానికి ఉపయోగపడే సూచనలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. రైతుల సమస్యలపై నిర్మాణాత్మక చర్చ జరపాల్సిన ప్రతిపక్షం రాజకీయ విమర్శలకే పరిమితం కావడం బాధ్యతారాహిత్యమని ఆయన పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావాల వల్ల వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో వ్యవసాయ రంగంపై వాటి ప్రభావం, రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, సాగు ప్రణాళికలపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.

**రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రాధాన్యం**

ఎల్‌నినో ప్రభావాల కారణంగా రైతులకు, వ్యవసాయ రంగానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలపై దృష్టి సారిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన చర్యలపై దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికలు రూపొందించడం, రైతులకు తగిన వ్యవసాయ సూచనలు అందించడం, సాగునీరు, తాగునీటి లభ్యతను పర్యవేక్షించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడంతోపాటు, ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులకు అవగాహన కల్పించడం ముఖ్యమని అన్నారు.

**విమర్శలు కాదు.. రైతులకు ఉపయోగపడే సూచనలు చేయాలి**

రైతులకు ఏం చేయాలో సూచనలు ఇవ్వకుండా, వారికి భరోసా కల్పించకుండా ప్రభుత్వంపై నిందలు వేయడం ద్వారా బీఆర్ఎస్ సాధించేదేమిటని కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. రైతుల సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మక సూచనలు చేయడం, వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు ప్రభుత్వానికి సహకరించడం ప్రతిపక్ష బాధ్యత అని అన్నారు. వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కొనే విషయంలో రైతుల్లో ఆందోళనలను పెంచడం కంటే, వారికి సరైన సమాచారం అందించి, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకునేలా ప్రోత్సహించడం అవసరమని పేర్కొన్నారు.

# నాతల్లగూడెంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### అర్హులైన ప్రతి ఒక్కరికీ స్మార్ట్ కార్డులు అందేలా కృషి చేస్తాం
### సర్పంచ్ మోటే జంగమ్మ లింగస్వామి



**వలిగొండ, అక్టోబర్ 24 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నాతల్లగడెం గ్రామంలో శనివారం గ్రామ సర్పంచ్ మోటే జంగమ్మ లింగస్వామి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోటే జంగమ్మ లింగస్వామి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అందులో భాగంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టడం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ రేషన్ సరుకులు మరింత సులభంగా అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, గ్రామంలోని అర్హులైన కుటుంబాలందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందేలా కృషి చేస్తామని ఆమె స్పష్టం చేశారు. కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత పెరగడంతోపాటు, ప్రభుత్వ సేవలను సులభంగా పొందేందుకు వీలవుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేద, మధ్యతరగతి కుటుంబాలకు రేషన్ సరుకులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందించే బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అర్హులైన లబ్ధిదారులకు సక్రమంగా చేరేలా సంబంధిత అధికారులు, రేషన్ డీలర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తూ అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలు అందించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మస్కు నరసింహ, జీపీఓ కాటుక కృష్ణ, మోటే నవీన్, నారి లింగస్వామి, కోల మచ్చేందర్, రేషన్ డీలర్ మోటే రాములమ్మ సాయిలు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించండి

**వాటర్ వర్క్స్ అధికారులకు సిపిఐ వినతి పత్రం.**



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 24 ( తొలివార్త ):ప్రతి నిధి.** ఎల్నినో కారణంగా రాబోవు రోజుల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది కాబట్టి ప్రజలను అప్రమత్తత చేయడానికి, నీటి వృధాను అరికట్టడానికి వాటర్ వర్క్స్ అధికారులు అన్ని బస్తీలలో పర్యటించి ప్రజలను చైతన్యపరిచి నీటిని వృధా చేయకుండా చూడాలని నేడు సిపిఐ ఆధ్వర్యంలో చింతల్ సర్కిల్ వాటర్ వర్క్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వికాస్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ,రాష్ట్ర నాయకులు ఏసురత్నం మాట్లాడుతూ బస్తీలలో మంచినీరు సరఫరా చేసే సమయంలో అధికారులు పర్యటించి ఎవరైతే నీరు వృధా చేస్తున్నారో వారికి జరిమానా విధిస్తే నీటిని వృధా చేసే మిగతా ప్రజలు కూడా భయపడి నీటిని వృధా చేయకుండా ఉంటారని అన్నారు. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే అనేకసార్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారని , నీటి వృధానీ అరికట్టాల్సిన వాటర్ వర్క్స్ అధికారులు అధికారులు కూడా ప్రకటనలకే పరిమితమైతే సరిపోదని వెంటనే క్షేత్రస్థాయి పర్యటనలు మొదలుపెట్టాలని అదేవిధంగా అక్రమంగా నడుస్తున్న వాటర్ ప్లాంట్లను కూడా మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు గిరి నగర్ మరియు జగద్గిరి గుట్టలో వివిధ ప్రాంతాలలో వివిధ బస్తీలలో ఎక్కడెక్కడ నీరు వృధాగా పోతుందో వాటి వివరాలను వాటర్ వర్క్స్ అధికారులకు ఇవ్వడం జరిగింది. వారం రోజుల్లోపు సిపిఐ ఇచ్చిన డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి శ్రీనివాస్ సిపిఐ మండల కార్యదర్శి కే స్వామి సహాయ కార్యదర్శి హరినాథ్ రావు ప్రజానాట్య మండల అధ్యక్షులు బాబు యువజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్, కీర్తి శాఖ కార్యదర్శి వెంకటేష్, యాకూబ్, సిపిఐ నాయకులు ఇమామ్ యాదన్న, సాగర్, రాజేష్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీలకు ఉచిత ఆటో సర్వీస్ సోషల్ వర్కర్ లతీఫ్.



**వైరా అక్టోబర్ 24 ( తొలివార్త ):** సిరిపురం కేజీ గ్రామంలో సోషల్ వర్కర్ లతీఫ్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు ఉచిత ఆటో సర్వీస్ నిర్వహిస్తున్నారు. దాచా పురం గ్రామానికి చెందిన గరిడేపల్లి భవాని అనే గర్భిణీ స్త్రీని మరియు విప్పల మడత గ్రామానికి చెందిన అక్కి శెట్టి ఉమా అనే గర్భిణీ స్త్రీని టెస్టర్ నిమిత్తం వైరా ఆసుపత్రికి తీసుకువెళ్లి టెస్టులు అనంతరం మరల వారి ఇంటి వద్ద నింపడం జరిగింది. ఈ సందర్భంగా సోషల్ వర్కర్ లతీఫ్ మాట్లాడుతూ సమాజంలో బడుగు బలహీన వర్గాల కోసం, ప్రతి ఒక్కరు కూడా తోటి వారికి సహాయ సహకారాలు అందించడంలో ముందుండాలని, తనవంతుగా గర్భిణీ స్త్రీలకు ఉచిత ఆటో సర్వీస్ నిర్వహించడం జరుగుతా ఉందని, సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు కూడా తోటి వారి పట్ల సహాయ సహకారాలు అందించాలని కోరారు. సోషల్ వర్కర్ లతీఫ్ ఫోన్ నెంబర్ 9603747878 కి ఫోన్ చేయగలరని తెలియజేశారు.

## మున్నూరు కాపు సంఘం ఆద్వర్యంలో

**సుగుణమ్మ దశదినకర్మల ఖర్చులకు ఆర్థిక సాయం అందజేత**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 24 ( తొలివార్త ):** అశ్వాపురం మండల పరిధిలోని, మొండికుంట గ్రామంలో జంగిలి సుగుణమ్మ అనారోగ్యం తో మరణించగా విషయం తెలుసుకున్న మున్నూరు కాపు సంఘం నాయకులు, వారి నివాసానికి వెళ్లి కుటుంబ, సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులకు దశదిన కర్మల ఖర్చుల నిమిత్తం 8500, రూపాయల ఆర్థిక సహాయాన్ని అందచేసిన మున్నూరుకాపు సంఘం సభ్యులు. ఈ కార్యక్రమం లో మండల సంఘం అధ్యక్షులు కమటం వెంకటేశ్వరావు యువజన సంఘం అధ్యక్షుడు పర్వత నరేష్, సభ్యులు తోట నర్సయ్య,బత్తిన ప్రసాద్ ,తోట వేణు,తులసి అశోక్, జెట్టి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# శాంతి నిలయం ఆశ్రమాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి జి. సబిత

**దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి**

**న్యాయ సేవలపై అవగాహన కల్పించాలి**





**వలిగొండ, అక్టోబర్ 24 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని శాంతి నిలయం ఆశ్రమాన్ని రామన్నపేట మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి. సబిత శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో నివసిస్తున్న వారి జీవన పరిస్థితులు, వారికి అందుతున్న సంరక్షణ, వసతులు, సౌకర్యాలు, సంక్షేమ కార్యక్రమాలను ఆమె పరిశీలించి, ఆశ్రమ నిర్వహణాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో నివసిస్తున్న వారికి అందుతున్న సేవలు, వారి రోజువారీ అవసరాలు, ఆరోగ్య సంరక్షణ, భద్రత, ఇతర సౌకర్యాల గురించి నిర్వహణాధికారులతో చర్చించారు. ఆశ్రమంలో నివసిస్తున్న వారందరికీ గౌరవప్రదమైన జీవనం అందించడంతోపాటు, వారి అవసరాలకు అనుగుణంగా తగిన సంరక్షణ కల్పించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.

**దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి**

దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవభావం, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని జడ్జి జి. సబిత సూచించారు. దివ్యాంగులు సహా సమాజంలోని బలహీన వర్గాల హక్కులను పరిరక్షించడం, వారికి సమాన అవకాశాలు కల్పించడం, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వివరించారు. వారికి ఎలాంటి వివక్ష లేకుండా గౌరవప్రదమైన జీవనం సాగించేలా సమాజం సహకరించాలని సూచించారు.

**న్యాయ సేవలపై అవగాహన అవసరం**

సమాజంలోని ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు న్యాయ సహాయం అందించడంలో న్యాయ సేవా సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె పేర్కొన్నారు. న్యాయ సహాయం పొందే హక్కు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చట్టపరమైన హక్కులపై అర్హులైన వారికి అవగాహన కల్పించడం ద్వారా వారు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు చూపవచ్చని తెలిపారు. అవసరమైన వారికి న్యాయ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం ప్రాధాన్యమైన అంశమని వివరించారు. సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమం, దివ్యాంగుల హక్కుల పరిరక్షణ, న్యాయ సహాయం అందించడం, సామాజిక న్యాయం సాధించడం లక్ష్యంగా రామన్నపేట మండల న్యాయ సేవా కమిటీ తన కృషిని కొనసాగిస్తుందని ఈ సందర్భన తెలియజేస్తోంది. ఆశ్రమంలోని వారి సంక్షేమం, హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలపై ఈ పర్యటనలో దృష్టి సారించారు.

## అక్షిత అకాల మరణం తీవ్ర విషాదకరం

## మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి



**ఖమ్మం అక్టోబర్ 24 ( తొలివార్త ):** అమెరికాలో గుండెపోటుతో అకాల మరణం చెందిన ఖమ్మం యువతి నల్లమల అక్షత మృతి పట్ల వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి తీవ్ర విచారణ వ్యక్తం చేశారు. శనివారం ఖమ్మంలో అక్షయత తండ్రి ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు నల్లమల ఆనంద్ దంపతులను పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఉన్నత చదువులు పూర్తి చేసుకొని ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేస్తున్న సమయంలో అచ్యుత అకాల మరణం చెందటం విషాదకరమనీ పేర్కొన్నారు. చేతి కందిన కుమార్తెను కోల్పోవడం తల్లిదండ్రులకు తీరని లోటు అని ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. అక్షిత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# ఎల్ నినో ప్రభావంపై వార్డు సభలు

**నీటి పొదుపుపై అవగాహన**

**చౌటుప్పల్ పురపాలక సంఘంలో విస్తృతంగా వార్డు సభలు**

**చైర్ పర్సన్ పావని రమేష్ గౌడ్**

**కమిషనర్ వెంకటేశ్వర నాయక్**





**చౌటుప్పల్, అక్టోబర్ 24 ( తొలివార్త ):** చౌటుప్పల్ పురపాలక సంఘం పరిధిలో ఎల్-నినో ప్రభావం,నీటి కొరత మరియు పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం రోజున పలు వార్డుల్లో వార్డు సభలను విజయవంతంగా నిర్వహించారు.

**8వ వార్డు (లక్కారం):**

ఉదయం 8:30 గంటలకు లక్కారం 8వ వార్డు ఆఫీస్ వద్ద వార్డు కౌన్సిలర్ బద్రి గాలయ్య అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర నాయక్ సారథ్యంలో వార్డు సభ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లక్కారం గ్రామ ప్రజలు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఎల్-నినో పై అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.అందుబాటులో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుంటామని ప్రజలు ప్రతిజ్ఞ చేశారు.

**4,5,6,15వ వార్డులలో (తంగడపల్లి):**

ఉదయం 9:30 గంటలకు గ్రామపంచాయతీ ఆఫీస్ నందు ఉమ్మడి సమావేశం నిర్వహించారు.4వ వార్డు కౌన్సిలరి ఊదరి యాదయ్య,5వ వార్డు కౌన్సిలర్ కొయ్యల శేఖర్ గౌడ్,6వ వార్డు కౌన్సిలర్ ఆలే శ్రీలత చిరంజీవి,15వ వార్డు కాన్సిలర్ గడ్డం ఇందిరా రాజరత్నం పాల్గొని,ఎల్-నినో ప్రభావంపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు సూచనలను వివరించారు.

**9,10,11,19వ వార్డులలో (చౌటుప్పల్):**

చౌటుప్పల్ కచేరీ వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షతన,కమిషనర్ ఎన్.వెంకటేశ్వర నాయక్ సారథ్యంలో సమావేశం జరిగింది.ఇందులో 10వ వార్డు కౌన్సిలర్ దేప రమ్య రాజు,19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, కాలనీవాసులు,మెప్మా ఆర్పీలు,మహిళలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ..పట్టణ పరిశుభ్రతతో పాటు,ఎల్-నినో ప్రభావం వల్ల ఏర్పడే నీటి ఎద్దడిని తట్టుకునేలా వనరులను పొదుపుగా వాడుకోవాలని సూచించారు.చిన్న చిన్న జాగ్రత్తలతో గేట్ వాల్వ్ లు మార్చుకోవడం,లీకేజీ పైపులు తీసి కొత్త పైపులు అమర్చుకోవడం, నీటి వృథాను అరికట్టవచ్చని తెలిపారు.తదుపరి కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంటిలో నీటి వృథాను అరికట్టాలని,ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా గాలి,నీరు,భూమిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందని,భవిష్యత్ తరాలకు ఈ స్వచ్ఛ సంపదను అందించాలని కోరారు.



**12,13వ వార్డులలో**

వినాయకుని మండపం వద్ద 12వ వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవి,13వ వార్డు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ మరియు కమిషనర్ ఎన్.వెంకటేశ్వర నాయక్ పాల్గొని 12,13 వార్డుల ప్రజలకు ఎల్-నినో అంశంపై విస్తృత అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ రెడ్డి,ఆర్వో అంజయ్య,ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ కె.హనుమాన్ ప్రసాద్,పర్యావరణ ఇంజనీర్ ఎం.రేణు కుమార్,వార్డు అధికారులు,బిల్ కలెక్టర్లు,జవాన్లు,పట్టణ ప్రముఖులు, నాయకులు,ప్రజలు, యువకులు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎల్ నీనో పై రైతులకు అవగాహన సదస్సు



**తుర్కపల్లి అక్టోబర్ 24 ( తొలివార్త ):** తుర్కపల్లి మండలం ములకలపల్లి, జేతురామ్ తండా, రాంపూర్ తండా మోతిరాం తండా గ్రామాల్లోఎల్ నీనో పై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్, వి బి హెచ్ ఓ శ్రీనాథ్, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి లు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావాల వల్ల ప్రజల దైనందిన జీవనంపై వ్యవసాయ రంగంపై పంటల సాగు విధానాలపై కలిగే ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించారు. వాతావరణ పరిస్థితుల్లో వచ్చే మార్పులు వర్షపాతం తగ్గే అవకాశాలు పంటలకు కలిగే నష్టాలను తగ్గించేందుకు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు తక్కువ నీటిని వినియోగించే పంటల సాగుకు ప్రాధాన్యత నివ్వాలని అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని అన్నారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటల గురించి వివరించారు గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు గ్రామ అభివృద్ధికి దోహదపడే విబీ జీరామ్ జి పథకం గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లో నీటి నిలువ సామర్థ్యాన్ని పెంపొందించుటకు నీటి ఇంకుడు గుంతలు నిర్మించడం వంటి పనులను చేపట్టడం వల్ల వర్షపు నీటిని సమర్ధవంతంగా ఒడిసిపట్టవచ్చని భూగర్భ జలాల పెంపుకు తోడ్పడడంతో పాటు గ్రామస్తులకు ఉపాధి అవకాశం లభిస్తాయని అన్నారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని అన్నారు. రైతులు ముందస్తు ప్రణాళికలతో పంటల సాగు చేపట్టడం నీటి వనరులను సంరక్షించడం గ్రామీణ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా వ్యవసాయ నష్టాలను తగ్గించుకొని గ్రామ సమగ్ర అభివృద్ధికి కృషి చేయడమే ఈ గ్రామ సభల ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బానోతు బుల్లి వీరన్న నాయక్, తహసిల్దార్ రవికుమార్, ఎం పి ఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ మంజుషా రాణి, ఉపసర్పంచ్ ,వార్డు సభ్యులు, ఏ ఈ ఓ లు, గ్రామపంచాయతీ కార్యదర్శి కూరెళ్ళ నాగరాజు, గ్రామ రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు

## దత్తాయ పల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం



**తుర్కపల్లి, అక్టోబర్ 24 ( తొలివార్త ):** తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో జంకేర్ పాలో మీ హాస్పిటల్ ఏఎస్ రావు నగర్ వారి సౌజన్యంతో గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో ప్రజలకు బిపి, షుగర్, జ్వరం, ఆక్సిజన్ స్థాయి, బరువు, ఎత్తు, గుండె సంబంధిత రోగాల పరీక్షలతో పాటు నిపుణులైన వైద్యులచే ఉచిత వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జిట్ట బాలకృష్ణ ,వార్డు సభ్యులు నల్లరాజు ,గుంటి రాజు, నాయకుడు ఎరుకల వెంకటేష్ గౌడ్, ధ్యాన బోయిన పోచయ్య, ధ్యాన బోయిన రమేష్, పంచాయతీ కార్యదర్శి సాయి, గ్రామపంచాయతీ సిబ్బంది స్వామి గౌడ్, కరుణాకర్, పుష్పమ్మ ,సత్తెమ్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ఘనంగా ఐక్యరాజ్యసమితి దినోత్సవ వేడుకలు

**ట్రినిటీ విద్యార్థులకు ఐక్యరాజ్యసమితి లక్ష్యాలపై వివరణ**



**చౌటుప్పల్, అక్టోబర్ 24 ( తొలివార్త ):** అంతర్జాతీయ శాంతి భద్రతలను కాపాడటానికి మరియు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలను పెంపొందించడానికి రెండవ ప్రపంచ యుద్ధం (1939–1945) అనంతరం, 1945 అక్టోబర్ 24న ఐక్యరాజ్యసమితి (ఖచీూ) ఏర్పడింది.ప్రారంభంలో 51 సభ్య దేశాలతో స్థాపించబడిన ఈ సంస్థలో ప్రస్తుతం 193 సభ్య దేశాలు ఉన్నాయి.ప్రపంచ దేశాల మధ్య శాంతి,సహకారం, స్నేహభావాన్ని పెంపొందించడమే ఐక్యరాజ్యసమితి ప్రధాన లక్ష్యం. ప్రతి సంవత్సరం అక్టోబర్ 24న ప్రపంచవ్యాప్తంగా ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని జరుపుకుంటారు.ఈ సందర్భంగా చౌటుప్పల్ లోని ట్రినిటీ విద్యాసంస్థల్లో ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీబీ కృష్ణారావు ఐఐటీ విద్యార్థులకు ఐక్యరాజ్యసమితి స్థాపన,లక్ష్యాలు, ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం ట్రినిటీ విద్య సంస్థల ప్రిన్సిపల్ కం డైరెక్టర్ ఉజ్జిని మంజుల విద్యార్థులకు ఐక్యరాజ్యసమితి ప్రాముఖ్యతను వివరించారు.విద్యార్థులు ఐక్యరాజ్యసమితి పనితీరు, ప్రపంచ శాంతిలో దాని పాత్ర గురించి తెలుసుకున్నారు.

## తాటి చెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు మృతి







**వలిగొండ, అక్టోబర్ 24 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడటంతో కొండం శంకరయ్య గౌడ్ అనే గీత కార్మికుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన శంకరయ్య గౌడ్ రోజువారీ పనిలో భాగంగా గురువారం ఉదయం సుమారు 6:30 గంటల సమయంలో తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. ఈ ఘటనలో ఆయన తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. చుట్టుపక్కల వారు గమనించి దగ్గరకు వెళ్లి చూడగా శంకరయ్య గౌడ్ అప్పటికే మృతి చెంది ఉన్నాడు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తయిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు శంకరయ్య గౌడ్‌కు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనతో రెడ్లరేపాక గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## శ్రీ గంగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు



**తుర్కపల్లి, అక్టోబర్ 24 ( తొలివార్త ):** తుర్కపల్లి మండల కేంద్రంతో పాటు హైదరాబాద్ లో శ్రీ గంగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరంతరం అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శ్రీ గంగా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బిర్రు బాల మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుర్కపల్లి మండల కేంద్రంలో శ్రీ గంగా చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు కోసం తన సొంత రెండు ఎకరాల పొలాన్ని విరాళంగా అందజేసినట్టు తెలిపారు .తను ఆకలి బాధలు ఎన్నో అనుభవించానని ఆ పరిస్థితులు పేద కుటుంబాలకు రావద్దని ఉద్దేశంతో నిత్య అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎండాకాలంలో జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గోవుల సంరక్షణలో భాగంగా పశువులకు పశుగ్రాసాన్ని పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. పేదలకు వృద్ధులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పేదలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేస్తూ సమాజ సేవలో నిరంతరం కొనసాగుతున్నట్లు తెలిపారు .నిత్యాన్నదానానికి దాతలు సహకారం అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఏ ఫలితం లేకుండా మానవసేవయే మాధవ సేవగా భావించి ఈ కార్యక్రమాలు తన సొంత నిధులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నదానం చేస్తే రోగాలు, నొప్పులు రాకుండా ఉంటాయని నమ్ముతున్నట్లుగా దాతలు సహకారం అందించి ఈ బృహత్తర కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని అన్నారు. ప్రభుత్వం శ్రీ గంగా చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను గుర్తించి మంచి కార్యానికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ అడ్వైజర్ షేర్ల అనిల్, ప్రధాన కార్యదర్శి బాణాల ప్రభులింగం పాల్గొన్నారు

తొలివార్త
RNI : TGTEL/25/A0357
ఆదివారం 25 - 10 - 2026

# ప్రజావాణి ఫిర్యాదుతో అక్రమ నిర్మాణం కూల్చివేత



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 24 ( తొలివార్త ):** ప్రతి నిధి. జగద్గిరిగుట్ట: రాజీవ్ గృహకల్ప కాలనీలోని సర్వే నంబర్ 348లో భూకబ్జాలు జరుగుతున్నాయని రాజీవ్ గృహకల్ప దళిత సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎర్ర యాకన్న ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో కబ్జా చేసి నిర్మించిన ఇంటిని ఆర్ఐ ఖలీమ్ ఆధ్వర్యంలో నేలమట్టం చేశారు. ఈ భూకబ్జాలపై ప్రెస్ మీట్ న్యూస్ యాప్‌లో ఇటీవల వార్త ప్రచురితం కావడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు.

# దసరా సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా వారి నివాసం వద్ద కలిసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ డివిజన్ అధ్యక్షులు...



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 24 ( తొలివార్త ):** ప్రతి నిధి. విజయదశమి దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని గౌరవ మాజీ మంత్రివర్యులు, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు మర్యాదపూర్వకంగా వారి నివాసం వద్ద కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేసి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్ , డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ , రుద్ర అశోక్ మరియు పోలే శ్రీకాంత్ కలిసి కేటీఆర్ ని మర్యాదపూర్వకంగా వారి నివాసం లో కలిశారు. విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నింపాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం కోసం పనిచేయాలనే సంకల్పంతో ముందుకు సాగాలని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, పార్టీ నాయకత్వం సూచనలతో ప్రజాసేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని నాయకులు తెలిపారు.

### శ్రీ సూర్య దేవి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో

# విద్యార్థులకు ఐరన్ డ్రిల్స్ ఏర్పాటు




**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 24 ( తొలివార్త ):** శ్రీ సూర్య దేవి చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం జటాయు ఆధ్వర్యంలో బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీనగర్, లోని మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం తరగతి గదులకు ఐరన్ డ్రిల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించడంతో పాటు, భవిష్యత్తులో విద్యా, వైద్య రంగాల్లో మరిన్ని విస్తృత సేవా కార్యక్రమాలు,నిర్వహించేందుకు లయన్స్ క్లబ్ మరియు శ్రీ సూర్య దేవి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా కృషి చేస్తాయని తెలిపారు. విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థలు, చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ యోగి సూర్యనారాయణ, జోన్ చైర్‌పర్సన్ బి. వెంకట్ రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం జటాయు అధ్యక్షులు బానోత్ మంగీలాల్, కార్యదర్శి కోపనాతి శాంతారావు, కోశాధికారి భాష్యం వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఎస్.ఎల్. కాంతారావు, సీనియర్ లయన్ సభ్యులు గోళ్ల భూపతిరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం కార్యదర్శి అనుగోజు నరసింహ చారి, లయన్ లేడీ యోగి శ్రీదేవి, లయన్స్ క్లబ్ ఆఫ్ సంపతి కార్యదర్శి కళ్యాణ్ చక్రవర్తి, లయన్ ఏ. రాము, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. తెల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ని మర్యాదపూర్వకంగా కలిసిన డా. ఆరిఫుద్దీన్ కల్వకుర్తి

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, పట్టభద్రుల సమస్యలపై చర్చ**



**హైదరాబాద్ అక్టోబర్ 24 ( తొలివార్త ):** హైదరాబాద్: గౌరవనీయులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ గారిని డా. ఎం.డి. ఆరిఫుద్దీన్ కల్వకుర్తి **(OU)** మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి అభ్యున్నతి, నిరుద్యోగ యువతకు సంబంధించిన అంశాలను వివరించి, ఈ సామాజిక సేవా ప్రయాణంలో వారి ఆశీస్సులు, మద్దతును కోరారు. డా. ఎం.డి. ఆరిఫుద్దీన్ కల్వకుర్తి ప్రగతి ఫౌండేషన్ చైర్మన్‌గా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ, పట్టభద్రుల సమస్యలకు చట్టసభలో బలమైన గొంతుకగా నిలవాలనే లక్ష్యంతో స్వతంత్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ముందుకు సాగుతున్నారు.

# కన్నెపల్లి పంప్ హౌసు మరియు మేడిగడ్డ సందర్శించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం.



**మేడిగడ్డ అక్టోబర్ 24 ( తొలివార్త ):** మేడిగడ్డ వద్ద ఇప్పటికే 751 టీఎంసీల నీళ్లు కిందికి వదిలేశారని,అందులో 200 టీఎంసీల నీళ్లు లిఫ్ట్ చేసినా హైదరాబాద్ తాగునీటి సమస్యతో పాటు,రైతులకు నీళ్లు అందించేవారని తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు. ఇప్పటికీ కూడా మేడిగడ్డ వద్ద 22 వేల క్యూసెక్కుల నీళ్లు దిగువకు పారుతున్నయి. ఈ నీటిని లిఫ్ట్ చేసి కాళేశ్వరం ద్వారా నీళ్లు అందిస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందని,కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిపోయిందని చేసిన దుష్ప్రచారం తెలిసిపోతుందని నీటిని ఎత్తడం లేదు. వీటిని ప్రజలకు చూపించి,ఇప్పటికైనా నీటిని లిఫ్ట్ చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కన్నెపల్లి పంప్ హౌసు సందర్శించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి,కేపీ వివేకానంద,మాధవరం కృష్ణారావు,మర్రి రాజశేఖర్ రెడ్డి,బండారు లక్ష్మారెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని అనుమతులతోనే వెగా జ్యువెల్లర్స్ ప్రారంభోత్సవానికి సిద్ధమా..?

**అధికారులు, నేతల అండదండలతోనే వాణిజ్య భవనంలో మార్పులు!**

**పార్కింగ్, ఫైర్ ఎన్ఓసీపై స్పష్టత ఏది?..**

**మౌనంగా టౌన్ ప్లానింగ్ యంత్రాంగం**






**చైతన్యపురి అక్టోబర్ 24 ( తొలివార్త ):** దిల్‌సుఖ్‌నగర్-చైతన్యపురి కమర్షియల్ హబ్‌లో జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్ నిబంధనలను దర్జాగా ఉల్లంఘిస్తూ ఒక ప్రముఖ జ్యువలరీ షోరూమ్ రూపుదిద్దుకోవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. 'వెగా జ్యువెల్లర్స్' (VEGA JEWELLERS) పేరుతో ప్రారంభానికి సిద్ధమవుతున్న ఈ భారీ కమర్షియల్ స్టోర్‌కు ఎలాంటి చట్టబద్ధమైన అనుమతులు లేవనే వార్తలు ఇప్పుడు నగరంలో హాట్ టాపిక్‌గా మారాయి. రాజకీయ అండదండలు, అధికారుల లాలూచీతోనే ఈ అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చైతన్యపురి ప్రధాన రహదారి పక్కనే ఉన్న వాణిజ్య సముదాయంలో నిబంధనలకు విరుద్ధంగా అంతర్గత, బాహ్య నిర్మాణాల్లో భారీ మార్పులు చేశారు. సాధారణంగా ఒక బహుళ అంతస్తుల జ్యువలరీ షోరూమ్‌ను ఏర్పాటు చేయాలంటే జీహెచ్ఎంసీ వాణిజ్య అనుమతులతో పాటు టౌన్ ప్లానింగ్ క్లియరెన్స్, పక్కా పార్కింగ్ లేఅవుట్, అగ్నిమాపక శాఖ (ఫైర్) నిరాక్షేపణ పత్రం తప్పనిసరి. అయితే, ఈ కనీస నిబంధనలు, అనుమతులను ఏవీ పట్టించుకోకుండానే పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం చేయడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో సరైన పార్కింగ్ వసతి లేకుండా భారీ షోరూమ్‌ను ప్రారంభిస్తే భవిష్యత్తులో తీవ్రమైన రవాణా దిగ్బంధం (ట్రాఫిక్ జామ్) ఏర్పడే ప్రమాదముంది. సామాన్యుడు చిన్న నిర్మాణం చేపడితే వెంటనే నోటీసులు ఇచ్చి కూల్చివేసే టౌన్ ప్లానింగ్ యంత్రాంగం, లక్షల ముడుపులు చేతులు మారడం వల్లే ఈ భారీ ఉల్లంఘనపై కన్ను మూసి ఉందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ కమిషనర్, సంబంధిత జోనల్ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, అనుమతులు లేని పక్షంలో ఈ షోరూమ్ ప్రారంభాన్ని నిలిపివేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# అంజనాపురంలో దొంగల బీభత్సం పట్టపగలే భారీ చోరీ

**రూ.2.5 లక్షల నగదు, 15 తులాల బంగారం, అరకేజీ వెండి ఎత్తుకెళ్లిన దుండగులు**

**కన్నీరుమున్నీరవుతున్న బాధితులు..**

**దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు**





**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు అక్టోబర్ 24 ( తొలివార్త ):** బూర్గంపాడు మండలం అంజనాపురంలో దుండగులు రెచ్చిపోయారు. ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా పట్టపగలే పక్కా ప్లాన్‌తో ఓ ఇంట్లోకి చొరబడిన దొంగలు. భారీ చోరీకి పాల్పడ్డారు. ఇళ్లలో ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకుని బీరువాలు పగలగొట్టి లక్షల రూపాయల విలువైన సొత్తును దోచుకెళ్లిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

**ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు:**

పోలీసులు మరియు స్థానికుల సమాచారం మేరకు, అంజనాపురం గ్రామంలోని లకావత్ బాల్య బాధితుల కుటుంబం పనుల నిమిత్తం ఇతర అవసరాల కోసం బయటకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. దీన్ని గమనించిన నిందితులు, ఇంట్లో ఎవరు లేని సమయాన్ని ఆసరాగా చేసుకుని లోపలికి ప్రవేశించారు. ఇంట్లో బీరువాలో భద్రపరిచిన సుమారు రూ. 2.5 లక్షల నగదు తోపాటు బంగారు ఆభరణాలు సుమారు 15 తులాల బంగారం మరియు వెండి వస్తువులు సుమారు అరకేజీ వెండి వస్తువులను సైతం దుండగులు వదలకుండా దోచుకెళ్లారు. వీటి మొత్తం విలువ సుమారుగా 25 లక్షలు ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు.

**లబోదిబోమంటున్న బాధితులు:**

పనుల ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని బాధితులు గుర్తించారు. లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువా తెరిచి ఉంది, అందులోని బట్టలు, సామాగ్రి అంతా చిందరవందరగా పడి ఉన్నాయి. దాచుకున్న కష్టమంతా క్షణాల వ్యవధిలో మాయమవడంతో బాధితుల కుటుంబ సభ్యులు గుండెలు బాదుకుంటూ లబోదిబోమంటున్నారు. కష్టపడి కూడబెట్టుకున్న సొమ్మంతా పోవడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనతో అంజనాపురం గ్రామ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

**రంగంలోకి దిగిన పోలీసులు.. దర్యాప్తు ముమ్మరం:**

సమాచారం అందుకున్న వెంటనే బూర్గంపాడు ఎస్సై మేడ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితుల వద్ద నుంచి వివరాలు సేకరించి, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. ఘటనా స్థలిని క్షుణ్ణంగా పరిశీలించారు. దొంగల ఆనవాళ్లను, వేలిముద్రలను సేకరిస్తున్నారు. చుట్టుపక్కల సీసీటీవీ ఫుటేజ్ ఏమైనా ఉందా అని పరిశీలిస్తున్నారు. అనుమానితుల కదలికలపై నిఘా పెట్టామని, త్వరలోనే దొంగలను పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై మేడ ప్రసాద్ తెలిపారు. పట్టపగలు జరిగిన ఈ భారీ చోరీ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకుని దర్యాప్తును వేగవంతం చేశారు.

# పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 24 ( తొలివార్త ):** మణుగూరు మండలంలోని మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఖమ్మం--నల్గొండ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిరినాకి నవీన్ మాట్లాడుతూ, ప్రతి గ్రామ పంచాయతీలో వార్డు సభ్యుల నుంచి గ్రామస్థాయి నాయకుల వరకు అందరూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. పట్టభద్రులకు అవగాహన కల్పించి, నవంబర్ 6వ తేదీలోపు అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటరు నమోదు పూర్తయ్యేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని,సూచించారు. అదేవిధంగా, ఎల్‌నినో ప్రభావం వల్ల కలిగే వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితుల కారణంగా భవిష్యత్తులో తలెత్తే నీటి ఎద్దడి, కరువు వంటి సమస్యలపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని నవీన్ అన్నారు. ప్రజలు నీటి కొరతతో ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలపై దృష్టి సారించాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా పిరినాకి నవీన్ కోరారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, గ్రామస్థాయిలో ప్రజా సమస్యలపై అవగాహన పెంపొందించడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి పొలామూరి రాజు ఆత్మ కమిటీ చైర్మెన్ ఆవుల సర్వేశ్వరరావు,మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య,మైనార్టీ అధ్యక్షులు రహీమ్ పాషా,సర్పంచ్ లు ఎనిక శ్వేతా,పాల్వంచ రాములు,పూనెం రమేష్, కారం పూజిత, ,మడకం రామకృష్ణ, శెట్టిపల్లి మాధవి, గుమాస్తాల సంఘం అధ్యక్షులు తాత ప్రసాద్, వార్డ్ సభ్యులు కొలిపిన్ని మానస, ఊకే కృష్ణవేణి మండల, గ్రామ, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం పై నరేందర్ రెడ్డి ఫైర్

**కరువు వస్తుందని ముందే చేతులెత్తేస్తారా? ప్రజలకు ఇచ్చిన హామీల మాటేమిటి?**



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 24 ( తొలివార్త ): ప్రతి నిధి.** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు, ప్రజలకు సమాధానం చెప్పాలి: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి. కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలను సాకుగా చూపి కాంగ్రెస్ ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకోవాలని చూస్తోందని జీడిమెట్ల 132 డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి విమర్శించారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నా, కరువు పరిస్థితులు ఎదురైనా రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నప్పుడు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, సమస్యలు వస్తాయని ముందే చెప్పి చేతులెత్తేయడం సరికాదన్నారు. రైతులు, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం తక్షణమే కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో రైతులకు అండగా నిలిచాం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ, సాగునీటి ప్రాజెక్టులు, రైతుబంధు, ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలతో రైతులకు అండగా నిలిచామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా సాగునీరు, తాగునీటి సమస్యలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరు గ్యారెంటీల అమలుపై స్పష్టత ఇవ్వాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుబంధు స్థానంలో రైతుభరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్‌తో పాటు ఆరు గ్యారెంటీల అమలు పరిస్థితిని స్పష్టం చేయాలన్నారు. కరువు పరిస్థితులను సాకుగా చూపి హామీలను పక్కనపెట్టడం సరికాదని అన్నారు. రైతులకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ పోరాడుతుంది రైతులు సాగునీటి కోసం, ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నరేందర్ రెడ్డి కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

# సైబరాబాద్ లోని జగద్గిరిగుట్ట పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఒక ప్రమాదకర నేరస్థుడిపై పీడీ (పీడీ ) చట్టం ప్రయోగం.



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 24 ( తొలివార్త ): ప్రతి నిధి.** సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐ.పి.ఎస్., నాగారాజు రఘు వర్మ అలియాస్ నాగారాజు కార్తికేయ రఘు వర్మ అలియాస్ వంశీ అలియాస్ అల్లూరి విజయ రామ్ అలియాస్ కల్నల్ కార్తికేయ సింగ్ అనే ప్రమాదకరమైన, కుఖ్యాతి చెందిన నేరస్థుడిపై 'పీడీ చట్టం' (ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్ ) ప్రయోగించారు. ఇతను భవిష్యత్తులో మరిన్ని నేరాలకు పాల్పడకుండా నిరోధించే ఉద్దేశంతో, ఇతనిని 'గూండా'గా పరిగణించి, మేడ్చల్ జిల్లాలోని చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ నేరస్థుడు ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందినవాడు. హైదరాబాద్‌కు వలస వచ్చిన ఇతను, మొదట్లో డ్రైవర్‌గా పనిచేశాడు. ఆ తర్వాత, సులభంగా డబ్బు సంపాదించి విలాసవంతమైన జీవితాన్ని గడపాలనే ఉద్దేశంతో నేరాల బాట పట్టాడు. ఇతను పోలీసు అధికారిగా నటిస్తూ, బాధితులపై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని నమ్మించి వారిని మోసం చేసేవాడు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భయపెట్టి, కేసుల నుండి కాపాడతామని చెప్పి డబ్బులు వసూలు చేసేవాడు. అంతేకాకుండా, వ్యక్తులను కిడ్నాప్ చేసి, తుపాకులు చూపించి వారి వద్ద ఉన్న నగదును దోచుకునేవాడు. 2017 నుండి 2026 మధ్య కాలంలో, ఇతను మోసం, కిడ్నాప్, దోపిడీ, బలవంతపు వసూళ్లు (ఎక్స్‌టోర్షన్ ), నేరపూరిత బెదిరింపులు మరియు 'ఆర్మ్స్ యాక్ట్, 1959' (ఆయుధ చట్టం) కింద నమోదైన మొత్తం 14 నేరాల్లో నిందితుడిగా ఉన్నాడు. గతంలో కూడా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2021 మరియు 2024 సంవత్సరాల్లో ఇతనిపై పీడీ చట్టాన్ని ప్రయోగించారు. అయితే, జైలు నుండి విడుదలైన తర్వాత కూడా ఇతను తన నేరపూరిత కార్యకలాపాలను కొనసాగించాడు. పోలీసు అధికారిగా నటిస్తూ కిడ్నాప్, బలవంతపు వసూళ్లు మరియు దోపిడీకి సంబంధించిన మరో నాలుగు కేసుల్లో ఇతను నిందితుడిగా ఉన్నాడు. తాజా కేసులకు సంబంధించి, సైబరాబాద్‌లోని జగద్గిరిగుట్ట పోలీసులు ఇతనిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. గతంలో తీసుకున్న నివారణ చర్యలు (పీడీ చట్టం) ఉన్నప్పటికీ, ఇతను పదేపదే నేరాలకు పాల్పడుతుండటాన్ని పరిగణనలోకి తీసుకున్న అధికారులు, మరోసారి ఇతనిపై పీడీ చట్టాన్ని ప్రయోగించి జైలులో ఉంచారు. అపరాధిపేరు మరియు చిరునామా: నాగరాజు రఘు వర్మ నాగరాజు కార్తికేయ రఘు వంశీ అల్లూరి విజయ రామ్ కల్నల్ కార్తికేయ సింగ్, వా/శీ నాగరాజు పద్మనాభరాజు పెద్దరాజు, వయస్సు: 29 సంవత్సరాలు, ఆంధ్ర ప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా, పోడూరు మండలం, స్వస్థలం.

RNI : TGTEL/25/A0357

# ఎమ్మెల్యే సుదీర్ రెడ్డిదే డబల్ బెడ్ రూమ్ దంద

**పీఏ లు, ఫోటో గ్రాఫర్లు,పని మనుషులకు,డ్రైవర్లకు, పొలాలు అమ్మినోళ్ళకు డబల్ బెడ్ రూమ్ ఇళ్ళు.**



**రంగారెడ్డి జిల్లా 24 అక్టోబర్ (తొలివార్త ) :** హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ మంత్రులపై డబల్ బెడ్ రూమ్ స్కాం అంటూ ఆరోపణలు చేస్తున్న బీ ఆర్ ఎస్ పార్టీ ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి గత ప్రభుత్వంలో చేసిన డబుల్ బెడ్ రూమ్ దందా మరిచిపోయి గురివింద మాటలు మాట్లాడుతూ రీల్స్ కోసం ఫోజులు కొడుతున్నారని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్ రెడ్డి లింగోజి గూడ లోని తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సుదీర్ రెడ్డి తన ఇంట్లో పనిమనుషులకు,ఫార్మ్ హౌస్ వర్కర్స్,డ్రైవర్ల పేరుతో డబల్ బెడ్ రూమ్ లు అమ్ముకున్న పట్టాల ఆధారాలతో సవాల్ విసిరారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి చేసిన అరాచకాలు అన్నీ ఇన్ని కావని, ఆయన దందాలు దుర్మార్గాలు ఆయన వెంట వుండే కార్యకర్తలే బయట పెడుతున్నరని వెల్లడించారు.డబల్ బెడ్ రూమ్ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేదలకు అందాల్సిన చోట ఎమ్మెల్యే లెటర్ హెడ్ తో అధికారులకు బెదిరింపులు చేసి ఎల్బీనగర్ నాంచారమ్మ బస్తీ, వనస్థలిపురం సాహెబ్ నగర్, హయత్ నగర్ తదితర ప్రాంతాల్లో తన ఇంట్లో,ఫార్మ్ హౌస్లో,స్నేహితుల ఇంట్లో పనిచేసే పనోళ్లకు,పీఏలకు, ఫోటో గ్రాఫర్లకు, ఫార్మ్ హౌస్ అమ్మిన యజమానులకు డబల్ బెడ్ రూమ్ ఇళ్ళు ఇప్పించి అమ్ముకున్న చరిత్ర సుదీర్ రెడ్డిదేనని ప్రవీణ్ రెడ్డి ఆరోపించారు. దొంగే దొంగ అంటూ సుదీర్ రెడ్డి శ్రీరంగ నీతులు వల్లివేస్తున్నారని, ఈ రోజు మీడియా ముందు ఉంచిన ఆదారాలలో ఎలాంటి అబద్ధాలు ఉంటే ఎమ్మెల్యే నిరూపించాలి,లేకుంటే అవి నిజమని ఒప్పుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులపై అవాస్థవాలు ఆరోపించాలను కుంటే ఆకాశం మీద ఉమ్మినట్టేనని ఎద్దేవా చేశారు.కార్యక్రమంలో లింగోజిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందికంటి శ్రీధర్ గౌడ్, సీనియర్ నాయకులు మనోజ్, వెంకట్, రోహిత్, నరేందర్, సచిన్, శివ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 18 జిల్లాల్లో కనిష్ఠ వర్షపాతం 358 మండలాల్లో కరవు!

ఎల్‌నినో పరిస్థితులపై క్యాబినెట్ సబ్‌కమిటీ చర్చించింది. నెలాఖరులో కరవు మండలాల జాబితాను వెల్లడించనుంది. రాష్ట్రంలో 358 మండలాల్లో కరవు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించింది. పరిస్థితులను పర్యవేక్షించాలని కలెక్టర్లను ఆదేశించింది. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులను అధిగమించేందుకు అన్ని శాఖలు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కేబినెట్ సబ్ కమిటీ ఆదేశించింది. కరవు మండలాలను గుర్తించి, ఈ నెలాఖరులోగా కేంద్రానికి పంపించాలని సూచించింది. కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి, నిరంతరం పరిస్థితులను పర్యవేక్షించాలని స్పష్టం చేసింది. రాష్ట్రంలో 358 మండలాల్లో కరవు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సీఎస్ సంజయ్ జాజు తెలిపారు.

### శాఖల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు

ఎల్‌నినో వల్ల ఎదురయ్యే కరవును ఎదుర్కొనేందుకు శాఖల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని మంత్రివర్గ ఉపసంఘం ఉన్నతాధికారులను ఆదేశించింది. సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం జరిగింది. ఎల్‌నినో, కరవు ప్రభావం, నీటి లభ్యత, రైతులకు అందించాల్సిన ఉపశమన చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. ఎల్‌నినోతో ఉత్పన్నమయ్యే పరిస్థితులపై చర్చించడానికి త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది.ఈ నెల 31లోగా కరవు మండలాలను ప్రకటించాలని సూచించింది. కరవు ప్రభావిత మండలాలను శాస్త్రీయంగా, నిబంధనల ప్రకారం గుర్తించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఏయే రంగాలపై ఎలా ఉండబోతోందో ముందుగానే అంచనా వేస్తే అవసరమైన సాయం సకాలంలో అందించేందుకు వీలవుతుందని కేబినెట్ సబ్ కమిటీ అభిప్రాయపడింది.

### యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలు

కలెక్టర్లు ప్రతి వారం సమీక్ష నిర్వహించి కరవు నివారణ చర్యలు చేపట్టాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. నీటి ఎద్దడి నేపథ్యంలో వరి వేయవద్దన్నారు. యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించి, చైతన్య పరచాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచించారు. ఎల్‌నినో తీవ్రత, భూగర్భ జలాల మట్టాలపై గణాంకాలను ప్రతి వారం జిల్లాల్లో విడుదల చేయాలన్నారు.

### చేపల మనుగడ కష్టమే

కలెక్టర్లు, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్లకు అత్యవసర ప్రత్యేక నిధులు కేటాయించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రంలో దాదాపు రూ.7 వేల కోట్లతో కరవు పనులు చేపడుతున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉండేలా కార్యాచరణను చేయాలని అధికారులను సీతక్క కోరారు. చెరువుల్లో నీరు గణనీయంగా తగ్గిపోతున్నందున చేపల మనుగడకు కష్టంగా మారిందని పశు



సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పెద్ద రిజర్వాయర్లలో చేపలను వదిలేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు.

### నెలాఖరులోగా కరవు మండలాల జాబితా

ప్రతి జిల్లా కలెక్టర్‌కు అత్యవసర నిధుల కింద రూ.కోటి ఇప్పటికే విడుదల చేసినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. రాష్ట్రంలో 358 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించినట్లు సీఎస్ చెప్పారు. ఈ నెల 31 తేదీలోగా కేంద్ర ప్రభుత్వానికి కరవు మండలాల జాబితాను సమర్పిస్తామన్నారు. రాష్ట్రంలో 18 జిల్లాల్లో కనిష్ఠ వర్షపాతం నమోదు కాగా, 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదయిందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 324 మండలాల్లో భూగర్భ జలాలు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయని సీఎస్ వివరించారు. రిజర్వాయర్లలో 470 టీఎంసీలకు గానూ 170 టీఎంసీలు మాత్రమే ఉన్నాయన్నారు. సింగూరు జలాశయంలో నీటి కొరత పరిస్థితులను అధిగమించడానికి ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందించామని స్పష్టం చేశారు.

# మహిళలపై నేరాల కేసులు.. దేశంలోనే ఏపీకి రెండో స్థానం!

**దేశవ్యాప్తంగా 187 మంది ప్రజాప్రతినిధులపై కేసులు**

**జాబితాలో బీజేపీ టాప్, టీడీపీకి మూడో స్థానం**

**14 మందిపై అత్యాచారం కేసులు.. ఐదుగురు కేంద్ర మంత్రులపై ఆరోపణలు**

**నేరచరిత ఉన్నవారిని అనర్హులుగా ప్రకటించాలన్న ఏడీఆర్**



చట్టసభల్లో మహిళల హక్కులు, రక్షణ గురించి మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులే మహిళలపై అఘాయిత్యాలు, వేధింపుల కేసుల్లో నిందితులుగా ఉన్నారన్న చేదు నిజాన్ని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక బట్టబయలు చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులపై నమోదైన క్రిమినల్ కేసులను విశ్లేషించి శుక్రవారం విడుదల చేసిన ఈ నివేదికలో సంచలన విషయాలు వెలుగుచూశాయి. ముఖ్యంగా, మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానంలో నిలవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.ఏడీఆర్ నివేదిక ప్రకారం, దేశవ్యాప్తంగా ఉన్న 4,881 మంది సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్లను విశ్లేషించగా, మొత్తం 187 మంది ప్రజాప్రతినిధులపై మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి. వీరిలో 19 మంది ఎంపీలు, 168 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరందరిలో 14 మందిపై (12 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు) నేరుగా అత్యాచారం (ఐపీసీ సెక్షన్ 376) కేసులు ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

### తెలుగు రాష్ట్రాల్లో కలవరపరిచే గణాంకాలు

మహిళలపై నేరాల కేసులున్న ప్రజాప్రతినిధుల జాబితాలో ఆంధ్రప్రదేశ్ 22 మందితో (21 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ) దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. కూటమి ప్రభుత్వంలోని నలుగురు మంత్రులపై కూడా ఇలాంటి కేసులు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. ఒక వివాదస్పద ఎమ్మెల్యేపై అత్యాచారం కేసు ఉందని, ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన ఒక యువ ఎంపీతో పాటు రాజ్యాంగ పదవిలో ఉన్న సీనియర్ నేతపై కూడా అభియోగాలున్నట్లు తెలిపింది.తెలంగాణలో మొత్తం ఐదుగురు ప్రజాప్రతినిధులపై (ముగ్గురు లోక్‌సభ ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్యేలు) కేసులున్నాయి. వీరిలో ముగ్గురు బీజేపీ ఎంపీలు కాగా, తొలిసారి గెలిచిన ఒక సిట్టింగ్ ఎంపీపై అత్యాచారం కేసు నమోదై ఉండటం గమనార్హం.

### పార్టీలు, రాష్ట్రాల వారీగా వివరాలు

పార్టీల వారీగా చూస్తే, బీజేపీకి చెందిన 106 మంది (95 మంది ఎమ్మెల్యేలు, 11 మంది ఎంపీలు) ఈ జాబితాలో ఉండి మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ నుంచి 20 మంది, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నుంచి 18 మంది (17 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ) ప్రజాప్రతినిధులు మూడో స్థానంలో ఉన్నారు. బీజేపీకి చెందిన 11 మంది ఎంపీలలో ఐదుగురు కేంద్ర మంత్రులు కాగా, వారిలో ఒకరు తెలుగు రాష్ట్రాలకు చెందినవారని నివేదిక స్పష్టం చేసింది. రాష్ట్రాల పరంగా పశ్చిమ బెంగాల్ (69) మొదటి స్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ (22) రెండో స్థానంలో, ఒడిశా (17) మూడో స్థానంలో నిలిచాయి.మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి రాజకీయ పార్టీలు టికెట్లు ఇవ్వడాన్ని ఏడీఆర్ తీవ్రంగా తప్పుబట్టింది. ఇలాంటి నేర చరిత్ర ఉన్నవారిని ఎన్నికల్లో పోటీ చేయకుండా శాశ్వతంగా అనర్హులుగా ప్రకటించాలని, వారి కేసులను ఫాస్ట్-ట్రాక్ కోర్టుల ద్వారా వేగంగా విచారించి శిక్షలు ఖరారు చేయాలని ఏడీఆర్ డిమాండ్ చేసింది.

# చైనా గస్తీ తీరుతో సరిహద్దుల్లో అలజడి.. కేంద్రం కీలక ప్రకటన

**చైనా గస్తీ విధానాల మార్పులతో సరిహద్దుల్లో పరిస్థితులు మారుతున్నాయని కేంద్రం వెల్లడి**

**అరుణాచల్‌లో చైనా సైనికులతో ముఖాముఖి పరిస్థితులు కొనసాగుతున్నాయని ఐటీబీపీ చీఫ్ ప్రకటన**

**సమస్యల పరిష్కారానికి భారత్, చైనా మధ్య చర్చలు కొనసాగుతున్నాయని విదేశాంగ శాఖ స్పష్టీకరణ**

**'శౌర్య' కమాండోలు తమ సామర్థ్యాలను ప్రదర్శించారని ఐటీబీపీ చీఫ్ వెల్లడి**

**డ్రోన్లు, యాంటీ డ్రోన్ వ్యవస్థలపై భారత్ దృష్టి పెట్టాలని కపూర్ సూచన**




చైనా సైన్యం నిర్దేశిత గస్తీ విధానాలకు భిన్నంగా వ్యవహరించినప్పుడల్లా భారత్-చైనా సరిహద్దుల్లో పరిస్థితులు అప్పుడప్పుడు ఉద్రిక్తంగా మారుతున్నాయని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో చైనా సైనికులతో ముఖాముఖి పరిస్థితులు కొనసాగుతున్నాయని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ ప్రకటించిన మరుసటి రోజే కేంద్రం ఈ వ్యాఖ్యలు చేసింది.

### రక్షణ శాఖను సంప్రదించండి

ఐటీబీపీ చీఫ్ వ్యాఖ్యలపై శుక్రవారం మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ నేరుగా స్పందించలేదు. ఈ అంశంపై రక్షణ శాఖను సంప్రదించాలని సూచించారు. అయితే, చైనా బలగాలు నిర్దేశిత గస్తీ విధానాలను ఉల్లంఘించినప్పుడు సరిహద్దుల్లో పరిస్థితులు మారుతున్నాయని గతంలోనూ చెప్పినట్లు గుర్తుచేశారు.

### చర్చలతో సమస్యల పరిష్కారం

వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వెంబడి అపోహలు, తప్పుడు అంచనాలు తలెత్తకుండా భారత్, చైనా దౌత్య, సైనిక మార్గాల్లో చర్చలు కొనసాగిస్తున్నాయని జైస్వాల్ తెలిపారు. సరిహద్దు నిర్వహణను మెరుగుపరిచేందుకు కొన్ని ప్రాంతాల్లో ఎల్‌ఏసీపై పరస్పర అవగాహన పెంచుకునే అంశంపైనా చర్చించేందుకు రెండు దేశాలు అంగీకరించాయని చెప్పారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగడం ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి కీలకమని స్పష్టం చేశారు.

### అరుణాచల్‌లో ముఖాముఖి పరిస్థితులు

రాజస్థాన్‌లోని ఐటీబీపీ స్థావరంలో గురువారం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడిన కపూర్.. అరుణాచల్‌ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో చైనా సైనికులతో ముఖాముఖి పరిస్థితులు ఏర్పడ్డాయని, అవి ఇంకా కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ఐటీబీపీ కొత్తగా ఏర్పాటు చేసిన 'శౌర్య' కమాండోలు తమ సామర్థ్యాలను ప్రదర్శించారని వెల్లడించారు. చైనా సరిహద్దును తమ దళానికి అత్యంత క్లిష్టమైన ప్రాంతంగా అభివర్ణించారు.

### డ్రోన్లపై ప్రత్యేక దృష్టి

చైనా సైన్యం ఆధునికీకరణను కపూర్ ప్రస్తావించారు. సంప్రదాయ పద్ధతుల్లో చైనాతో పోటీపడటం కష్టమని, డ్రోన్లు, వాటిని ఎదుర్కొనే వ్యవస్థలపై భారత్ భారీగా దృష్టి పెట్టాలని సూచించారు. డ్రోన్ల రాకతో సంప్రదాయ సైన్యాల పాత్ర మారిందని పేర్కొన్నారు. అయితే, సరిహద్దుల్లో సాధారణ మోహరింపు, సన్నద్ధతకు సంబంధించిన సందర్భంలోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. నిర్దిష్ట ఘటనను ఆయన ప్రస్తావించలేదని పేర్కొన్నాయి.చైనాతో భారత్‌కు 3,488 కిలోమీటర్ల వాస్తవాధీన రేఖ ఉంది. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణలో 20 మంది భారత సైనికులు మరణించిన తర్వాత సరిహద్దు పరిస్థితులపై ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. అయితే, ప్రస్తుతం పరిస్థితి స్థిరంగా ఉందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి సెప్టెంబరులో పేర్కొన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సైతం చైనాతో సంబంధాలు సాధారణ స్థితికి రావాలంటే సరిహద్దుల్లో శాంతి అవసరమని ఇటీవల స్పష్టం చేశారు.

# ఉత్తరాంధ్ర వైపు దూసుకొస్తున్న 'ఆర్నాబ్' తుపాను.. 27, 28 తేదీల్లో కుంభవృష్టి

**బంగాళాఖాతంలో బలపడుతున్న అల్పపీడనం**

**27, 28 తేదీల్లో తీరం దాటే అవకాశం**

**ఉత్తర కోస్తా జిల్లాలకు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు!**

**మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచన**



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి తుపానుగా మారేందుకు సిద్ధమవుతోంది. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో ఏర్పడుతున్న ఈ తొలి తుపానుకు 'ఆర్నాబ్' అని పేరు పెట్టనున్నారు. ఇది ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది.శుక్రవారం తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది శనివారం నాటికి వాయుగుండంగా, ఆదివారానికి తీవ్ర వాయుగుండంగా మారి, సోమవారం (అక్టోబర్ 26) ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడనుంది. ఆ తర్వాత పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ అక్టోబర్ 27, 28 తేదీల్లో ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాల వైపునకు చేరుతుందని ఐఎండీ అంచనా వేస్తోంది.తుపాను ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర జిల్లాల్లో గంటకు 70 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్ని వాతావరణ నమూనాలు ఇది మరింత బలపడి తీవ్ర లేదా అతి తీవ్ర తుపానుగా మారవచ్చని సూచిస్తున్నాయి. ఈ నెల 27, 28 తేదీల్లో శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు, అక్కడక్కడా కుంభవృష్టి కురిసే అవకాశం ఉంది. ఒడిశా తీరంలోనూ ఇదే తరహాలో వర్షాలు పడతాయని హెచ్చరించారు.ఈ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. సంబంధిత జిల్లాల యంత్రాంగాలను సిద్ధం చేశాయి. సముద్రం అలజడిగా ఉన్నందున, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని ఐఎండీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఖరీఫ్ పంట కోత దశలో ఉన్నందున, రైతులు వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అధికారులు తుపాను కదలికలను నిరంతరం గమనిస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని విడుదల చేస్తున్నారు. ప్రజలు అధికారిక ప్రకటనలను మాత్రమే అనుసరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఏపీ మున్సిపల్ ఎన్నికల బరిలో ఎంఐఎం.. 21 స్థానాల్లో పోటీ

ఏపీ మున్సిపల్ ఎన్నికల బరిలో ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పార్టీ నిలిచింది. రాష్ట్రంలోని రెండు కార్పొరేషన్లు, ఐదు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 21 మంది అభ్యర్థులను పోటీకి దింపింది.వివరాల్లోకి వెళితే.. కడప కార్పొరేషన్ మేయర్ పదవికి, హిందూపురం మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ పదవికి ఎంఐఎం అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీటితో పాటు విజయవాడ కార్పొరేషన్‌లోని మూడు డివిజన్లలో, హిందూపురంలో ఐదు వార్డుల్లో, ఆదోనిలో ఏడు, రాయదుర్గ్‌లో మూడు, నంద్యాల, పెనుగొండ మున్సిపాలిటీల్లో ఒక్కో వార్డు చొప్పున అభ్యర్థులను బరిలో నిలిపింది.ఇటీవలే ఏపీకి చెందిన ఎంఐఎం నేతలు హైదరాబాద్‌లో పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విస్తృతంగా పోటీ చేయడం కంటే, పార్టీకి గెలుపు అవకాశాలు బలంగా ఉన్న వార్డులు, డివిజన్లపైనే దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. పార్టీ విస్తరణ ప్రయత్నాల్లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ఎంఐఎం ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మిరాజ్, మహమ్మద్ ముబీన్, మాజిద్ హుస్సేన్, ఎమ్మెల్సీ రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ ఏపీలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ ఉనికిని విస్తరించుకోవడంలో భాగంగా పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.

# లైవ్ రిపోర్టింగ్‌లో ప్రమాదం.. సముద్రం ప్రమాదకరం అని చెబుతుండగానే జర్నలిస్ట్‌ను ముంచెత్తిన భారీ కెరటం



స్పెయిన్‌లో ఒక టెలివిజన్ జర్నలిస్ట్ లైవ్ రిపోర్టింగ్ ఇస్తుండగా ఊహించని ప్రమాదం జరిగింది. సముద్ర తీరంలో వాతావరణం ప్రమాదకరంగా ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్న సమయంలోనే ఒక భారీ కెరటం అతడిని బలంగా తాకి కింద పడేసింది. ఈ ఘటన మొత్తం లైవ్‌లో ప్రసారం కాగా, ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.వివరాల్లోకి వెళితే.. స్పెయిన్‌లోని బాస్క్ తీరంలో ఉన్న ఒండార్రోవా పట్టణంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. ఈ పరిస్థితులపై 'ఇుదీ2' ఛానెల్ కోసం పనిచేసే జర్నలిస్ట్ సెర్జియో ఒవెజెరో 'యూస్కాడి క్వెడెట్' అనే కార్యక్రమంలో భాగంగా లైవ్ రిపోర్టింగ్ ఇస్తున్నారు. సముద్రపు గోడ వద్ద నిలబడి, అలల ఉధృతి గురించి వివరిస్తుండగా.. అకస్మాత్తుగా ఒక పెద్ద కెరటం గోడను దాటి రిపోర్టర్‌పై విరుచుకుపడింది.ఆ కెరటం ధాటికి సెర్జియోతో పాటు కెమెరావుమన్ రాక్వెల్ కూడా నియంత్రణ కోల్పోయి కిందపడిపోయారు. నీరు వారిని చుట్టుముట్టడంతో లైవ్ ప్రసారం ఒక్కసారిగా నిలిచిపోయింది. స్టూడియోలో ఉన్న యాంకర్ ఓడెయి ఎస్నోలా, కనెక్షన్ కట్ అవ్వడంతో ఆందోళనకు గురయ్యారు. అయితే, కాసేపటి తర్వాత టీవీ సిబ్బంది స్పందిస్తూ.. సెర్జియో, రాక్వెల్ ఇద్దరూ సురక్షితంగా ఉన్నారని, వారికి ఎటువంటి తీవ్రమైన గాయాలు కాలేదని ప్రకటించారు. ప్రమాదం తర్వాత జర్నలిస్ట్ సెర్జియో కూడా సోషల్ మీడియా ద్వారా తాను క్షేమంగా ఉన్నట్లు తెలుపడంతో ప్రేక్షకులు ఊపిరి పీల్చుకున్నారు.తాను దేని గురించి అయితే హెచ్చరిస్తున్నాడో, అదే ప్రమాదానికి గురైన జర్నలిస్ట్ ఉదంతంపై నెటిజన్లు పలు రకాలుగా స్పందిస్తున్నారు. కొందరు ఆందోళన వ్యక్తం చేయగా, మరికొందరు వారు క్షేమంగా బయటపడటంపై సంతోషం వ్యక్తం చేశారు.

# భర్త వివాహేతర సంబంధం క్రూరత్వం కాదు: మద్రాస్ హైకోర్టు కీలక తీర్పు

**సెక్షన్ 498ఏ కింద నేరం రుజువు కావాలంటే అదనపు హింస ఉండాలని స్పష్టీకరణ**

**భార్య, బిడ్డ ఆత్మహత్య కేసులో భర్తను నిర్దోషిగా ప్రకటించిన తీర్పుకు సమర్థన**

**వరకట్న వేధింపుల ఆరోపణలు కూడా నిరూపితం కాలేదని పేర్కొన్న న్యాయస్థానం**

**మృతురాలి సోదరుడు దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసిన హైకోర్టు**




భర్తకు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉన్నంత మాత్రాన, దాన్ని భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) సెక్షన్ 498ఏ కింద భార్య పట్ల క్రూరత్వంగా పరిగణించలేమని మద్రాస్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ సెక్షన్ కింద నేరం రుజువు కావాలంటే, కేవలం వివాహేతర సంబంధం మాత్రమే కాకుండా అంతకు మించిన క్రూరమైన చర్యలు నిరూపితం కావాలని స్పష్టం చేసింది. భార్య, బిడ్డ ఆత్మహత్యకు సంబంధించిన కేసులో భర్తను నిర్దోషిగా ప్రకటిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది.2008లో వివాహం చేసుకున్న దంపతులకు ఒక బిడ్డ ఉన్నాడు. అయితే 2010లో భార్య తన ఏడాదిన్నర వయసున్న బిడ్డతో కలిసి నీటిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. తన భర్త వరకట్నం కోసం వేధించాడని, మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను, బిడ్డను నిర్లక్ష్యం చేశాడని గతంలో ఆమె ఆరోపించింది. దీంతో పోలీసులు భర్తపై ఐపీసీ సెక్షన్ 498ఏ (క్రూరత్వం), 306 (ఆత్మహత్యకు ప్రేరేపణ) కింద కేసు నమోదు చేశారు.ఈ కేసును విచారించిన తిరుప్పూర్ ఫాస్ట్ ట్రాక్ మహిళా కోర్టు, వరకట్న వేధింపుల ఆరోపణలు నిరూపితం కాలేదని పేర్కొంటూ 2018లో భర్తను నిర్దోషిగా ప్రకటించింది. ప్రభుత్వం ఈ తీర్పుపై అప్పీల్‌కు వెళ్లకపోవడంతో, మరణించిన మహిళ సోదరుడు టి.దైవకుమార్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు.ఈ అప్పీల్‌పై జస్టిస్ సుందర్ మోహన్ విచారణ జరిపారు. విచారణలో భర్తకు వివాహేతర సంబంధం ఉందని రుజువైన విషయాన్ని హైకోర్టు అంగీకరించింది. అయితే, ఆ సంబంధం భార్యను ఆత్మహత్యకు పురిగొల్పేంత తీవ్రమైన స్వభావం కలది కాదని అభిప్రాయపడింది. "కేవలం వివాహేతర సంబంధం మాత్రమే సెక్షన్ 498ఎ కింద నేరం కాదు. అంతకు మించిన క్రూరత్వం జరిగిందని నిరూపించాలి. ఈ కేసులో ఆ తరహా ఆధారాలు లేవు" అని న్యాయమూర్తి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా గతంలో సుప్రీంకోర్టు 'పినాకిన్ మహిపత్రాయ్ రావల్ వర్సెస్ గుజరాత్ రాష్ట్రం' కేసులో ఇచ్చిన తీర్పును ఉదహరించారు. వరకట్న వేధింపుల ఆరోపణలు కూడా అస్పష్టంగా ఉన్నాయని, ప్రాథమిక ఫిర్యాదులో వాటి ప్రస్తావన లేదని పేర్కొంటూ అప్పీల్‌ను కొట్టివేశారు.

# ఫలితాలు ప్రకటించిన ఇన్ఫోసిస్.. రూ.26 డివిడెండ్ కూడా..!




ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ లిమిటెడ్, 2026 సెప్టెంబర్ 30తో ముగిసిన త్రైమాసికానికి తన నికర లాభం 6% పెరిగి రూ. 7,823 కోట్లకు చేరినట్లు అక్టోబర్ 23న ప్రకటించింది. ఇంధన, యుటిలిటీ రంగాల క్లయింట్ల నుండి డిమాండ్ పెరగడం, అలాగే వ్యాపార సంస్థలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవలపై అధికంగా ఖర్చు చేయడం దీనికి కారణం. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ. 7,364 కోట్ల నికర లాభాన్ని నివేదించింది. కంపెనీ ఒక్కో షేరుకు రూ. 26 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. 2026 నవంబర్ 3ని రికార్డ్ తేదీగా, 2026 నవంబర్ 11ని చెల్లింపు తేదీగా నిర్ణయించింది. కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం 2026 క్యూ2లో రూ. 44,490 కోట్ల నుంచి 2027 క్యూ2లో 11 శాతం పెరిగి రూ. 49,244 కోట్లకు చేరింది. అయితే, సవాలుతో కూడిన డిమాండ్ వాతావరణాన్ని కారణంగా చూపుతూ, పూర్తి సంవత్సరానికి తన ఆదాయ వృద్ధి మార్గదర్శకత్వాన్ని తగ్గించింది. బెంగళూరుకు చెందిన ఈ ఐటీ సేవల సంస్థ, తన స్థిర-కరెన్సీ ఆదాయ వృద్ధి అంచనాను గతంలోని 1.5-3% శ్రేణి నుంచి 1-2 శాతానికి సవరించింది. ఈ త్రైమాసికంలో కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం వార్షిక ప్రాతిపదికన 11 శాతం పెరిగి రూ. 49,244 కోట్లకు చేరింది. అంతకుముందు ఇది రూ. 44,000గా ఉంది. ఒక నెలలో 17 శాతం లాభపడిన ఐటీ ఇండెక్స్.. ఐటీ స్టాక్?ల్లో పెట్టుబడి పెట్టొచ్చా..! జూన్ త్రైమాసికంలోని రూ. 48,211 కోట్ల నుంచి ఆదాయం 2% పెరిగింది. కాగా, నికర లాభం రూ. 7,769 కోట్ల నుండి 0.7% స్వల్పంగా పెరిగింది. డాలర్లలో చూస్తే ఆదాయం $5.15 బిలియన్లుగా ఉంది. ఇది వార్షిక ప్రాతిపదికన 1.3 శాతం వృద్ధిని సూచిస్తుంది. ఈ సంస్థ తన పూర్తి సంవత్సరానికి ఆపరేటింగ్ మార్జిన్ మార్గదర్శకత్వాన్ని 20-22%గా కొనసాగించింది. నిర్వహణ లాభం గతేడాదితో పోలిస్తే 10.4% పెరిగి రూ. 10,330 కోట్లకు చేరగా, నిర్వహణ మార్జిన్ 21% వద్ద నిలిచింది. ఇన్ఫోసిస్ $5.2 బిలియన్ల విలువైన పెద్ద డీల్ బుకింగ్‌లను కూడా నివేదించింది. ఇందులో $2 బిలియన్లకు పైగా విలువైన ఒక మెగా డీల్ కూడా ఉంది. మొత్తం కాంట్రాక్ట్ విలువలో కొత్త వ్యాపారం 62% వాటాను కలిగి ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవలు మరో వృద్ధి రంగంగా నిలిచాయి. ఆదాయం వరుసగా 29 శాతం పెరిగిందని , ఈ త్రైమాసికంలో మొత్తం ఆదాయంలో 10.5% వాటాను కలిగి ఉందని ఇన్ఫోసిస్ తెలిపింది. స్వీకరణ, ఆటోమేషన్, ఉత్పాదకత మెరుగుదలలు, సాంకేతికత-ఆధారిత పరివర్తన కోసం సంస్థల నుండి ఉన్న డిమాండే ఈ పనితీరుకు కారణమని పరేఖ్ పేర్కొన్నారు. వివిధ వ్యాపార విభాగాలలో పనితీరు అస్థిరంగా ఉంది. లైఫ్ సైన్సెస్ విభాగం అత్యధికంగా ఏడాది ప్రాతిపదికన స్థిర కరెన్సీ పరంగా 32.5% వృద్ధిని నమోదు చేసింది. ఆ తర్వాతి స్థానాల్లో ఎనర్జీ, యుటిలిటీస్, రిసోర్సెస్ అండ్ సర్వీసెస్ (7.3%), కమ్యూనికేషన్స్ (4.1%), ఫైనాన్షియల్ సర్వీసెస్ (2.1%) ఉన్నాయి. ఐరోపాలో స్థిర కరెన్సీ పరంగా 4.6% వృద్ధి నమోదు కాగా, మొత్తం ఆదాయంలో 54.6% వాటాను కలిగి ఉన్న ఉత్తర అమెరికాలో 1.5% క్షీణత నమోదైంది. ఇన్ఫోసిస్ రూ. 8,898 కోట్ల ఫ్రీ క్యాష్ ఫ్లోను ప్రకటించింది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# రికార్డు సృష్టించిన జియో ఐపీఓ.. షేర్లు వచ్చిన వారికి పండగే..!




దేశంలోనే అతి పెద్ద ఐపీఓగా వచ్చిన జియో ఐపీఓకు పెట్టుబడిదారుల నుంచి భారీ డిమాండ్ వచ్చింది. జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ రూ. 30,200 కోట్ల ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ 18.55 రెట్లు సబ్‌స్క్రిప్షన్ అయింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్స్ 56.15 రెట్లు, నాన్-ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్స్ 13.87 పెట్లు, రిటైల్ ఇండివిడ్యువల్ ఇన్వెస్టర్స్ 2.65 రెట్లు, ఉద్యోగుల రిజర్వేషన్ 2.87 రెట్లు, షేర్‌హోల్డర్ల రిజర్వేషన్ 7.50 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఐపీఓకు సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి అసాధారణమైన స్పందన లభించింది. ఇది అనుకూలమైన లిస్టింగ్ జరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అక్టోబర్ 23న ఉదయం 7:37 గంటల సమయానికి, గ్రే మార్కెట్ ప్రీమియం షేరుకు రూ. 240గా ఉంది. ఐపీఓ ధరల శ్రేణిలో గరిష్ట ధర రూ. 1,119గా ఉన్నందున, దీని ప్రకారం షేరు దాదాపు రూ. 1,359 వద్ద లిస్ట్ అయ్యే అవకాశం ఉంది. అంటే దాదాపు 21.45% లాభం లభించవచ్చు. గ్రే మార్కెట్ ప్రీమియం అనేది మార్కెట్ సెంటిమెంట్‌ను సూచించే ఒక అనధికారిక సంకేతం మాత్రమేనని గుర్తుంచుకోవాలి. ఇది షేర్లు ఖచ్చితంగా అదే ధరకు లిస్ట్ అవుతాయని హామీ ఇవ్వదు. చివరి రోజున పెట్టుబడి పెట్టాలనుకునే వారు అన్ని పరిశీలించి పెట్టుబడి పెట్టొచ్చు.గ్రే మార్కెట్ లో ప్రీమియంలో ట్రేడవుతున్న జియో షేర్లు..! జియో ప్లాట్‌ఫారమ్స్ ఐపీఓలో ఒక లాట్ అంటే 12 షేర్లు ఉంటాయి. గరిష్ట ధర శ్రేణి రూ. 1,119 వద్ద ఒక రిటైల్ పెట్టుబడిదారుడు ఒక లాట్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే రూ. 13,428 అవసరమవుతుంది. ఒకవేళ స్టాక్ ఇష్యూ ధర కంటే 20% ప్రీమియంతో లిస్ట్ అయితే, అంచనా వేసిన లిస్టింగ్ ధర ఒక్కో షేరుకు రూ. 1,342.80 అవుతుంది. దీని అర్థం ఒక్కో షేరుపై రూ. 223.80 స్థూల లాభం వస్తుంది. అంటే 12 షేర్లు ఉన్న ఒక లాట్‌పై మొత్తం రూ. 2,685.60 లాభం లభిస్తుంది. 20% లిస్టింగ్ లాభం వస్తుందని భావిస్తే, కేటాయించబడిన లాట్ల సంఖ్యను బట్టి లాభం ఎలా మారుతుందో ఇక్కడ చూడవచ్చు. జియో ప్రపంచవ్యాప్తంగా కోటి దరఖాస్తుల మార్కును దాటిన మొట్టమొదటి ఐపీఓగా ఇది నిలిచింది. గతంలో వారీ ఎనర్జీస్‌కు అందిన దాదాపు 97 లక్షల దరఖాస్తుల రికార్డును ఇది అధిగమించింది. వాల్యూవేషన్ పరంగా చూస్తే ఎయిర్ టెల్ కంటే.. జియో ఎక్కువ వాల్యూవేషన్ లో వస్తోంది. అయితే దేశంలో ఎయిర్ టెల్, జియో మధ్య పోటీ ఉన్న నేపథ్యంలో జియో ఐపీఓకు భారీ డిమాండ్ వచ్చింది. పైగా ఇది రియన్స్ ఇండస్ట్రీ కంపెనీ కాబట్టి చాలా మంది పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చినట్లు నిపుణులు చెబుతున్నారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# రైతులకు గుడ్ న్యూస్.. ఆ తేదీనే అన్నదాతల ఖాతాల్లోకి రూ.6 వేలు జమ..!



రైతులు శుభవార్త వచ్చింది. ఏపీ ప్రభుత్వం వచ్చే వారం అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేసే అవకాశం ఉంది. ఎందుకంటే.. పీఎం కిసాన్ 24వ విడత నిధులు అక్టోబర్ 30న రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అదే రోజు అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు సంవత్సరానికి రూ.20 వేలు చెల్లిస్తున్నారు. ఇందులో పీఎం కిసాన్ రూ.6 వేలు పోను.. మిగతా మొత్తం రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల ఖాతాల్లో జమ చేస్తోంది. అంటే రూ.14 వేలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. పీఎం కిసాన్ అక్టోబర్ 30న విడుదల కానున్న నేపథ్యంలో అదే పీఎం కిసాన్ విడుదల రోజే రాష్ట్ర ప్రభుత్వం రూ.4 వేలు, పీఎం కిసాన్ రూ.2 వేలు మొత్తం అన్నదాతల ఖాతాల్లో రూ.6 వేలు జమ చేయనున్నారు. పీఎం కిసాన్ పథకాన్ని 2019లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ పథకంలో భాగంగా నాలుగు నెలలకు రూ.2 వేల చొప్పున్న సంవత్సరానికి రూ.6 వేలు రైతులు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇప్పటి వరకు 23 విడతలుగా అన్నదాతల ఖాతాల్లో రూ.46 వేలు జమ అయ్యాయి. 23వ విడత పీఎం కిసాన్ నిధులు జూన్ లో రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇప్పుడు అక్టోబర్ 30న అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో రూ.2 వేలు జమ చేస్తారని వార్తలు వస్తున్నాయి. రైతులకు కేంద్రం దీపావళి కానుక.. నేరుగా ఖాతాల్లోకి రూ.2 వేలు.. అక్టోబర్ 30న పీఎం-కిసాన్ 24వ విడత నిధులు విడుదల. అన్నదాత సుఖీభవ పథకంలో పీఎం కిసాన్ నిధులు విడుదల చేస్తున్నప్పుడు వాటితో కలిపి రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయితే పీఎం కిసాన్ పథకంలో ఇచ్చే రూ.6 వేలను రూ.9 వేలకు పెంచాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అన్నదాతలకు ఆర్థిక సాయం చేసేందుకు పలు రాష్ట్రాల ప్రభుత్వాలు పలు పథకాలు తీసుకొచ్చాయి. ఇందులో భాగంగా తెలంగాణలో రైతు భరోసా, ఏపీలో అన్నదాత సుఖీభవ పథకాలు తీసుకొచ్చాయి. రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.12 వేలు జమ చేస్తున్నారు. సీజన్ కు రూ. 6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. తెలంగాణలో పీఎం కిసాన్, రైతు భరోసా పథకాలు విడివిడిగా అమలు చేస్తున్నారు. ఉదాహరణకు ఓ వ్యక్తికి ఎకర భూమి ఉంటే.. రైతు భరోసా కింద రూ.12 వేలు, పీఎం కిసాన్ కింద రూ.6 వేలు మొత్తం రూ.18 ఆ రైతు ఖాతాలో జమ అవుతాయి. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# ఐదేళ్లలో అత్యధిక రాబడులు ఇచ్చిన స్మాల్ క్యాప్ మ్యూచువల్ ఫండ్లు ఇవే..!




మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టేవారు రిస్క్ తీసుకుని స్మాల్ క్యాప్ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెడితే మంచి రాబడి ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. గత ఐదేళ్లలో అత్యధిక రాబడినిచ్చిన స్మాల్-క్యాప్ మ్యూచువల్ ఫండ్ల ఏమిటో చూద్దాం. బంధన్ స్మాల్ క్యాప్ ఫండ్ ఐదేళ్లలో 18.5 శాతం రాబడి ఇచ్చింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ 18.50 శాతం రాబడి ఇవ్వగా.. ఇన్వెస్కో స్మాల్ క్యాప్ ఫండ్ 17.90 శాతం, క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్ 17.10, నిప్పాన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ 17 శాతం, ఐటీఐ స్మాల్ క్యాప్ ఫండ్ 16.50 శాతం రాబడి ఇచ్చింది. స్మాల్-క్యాప్ మ్యూచువల్ ఫండ్ అనేది ఒక ఓపెన్-ఎండెడ్ ఈక్విటీ పథకం. ఇది తన ఆస్తులలో ఎక్కువ భాగాన్ని చిన్న-కంపెనీ స్టాక్‌లలో ఉంచాలి. చారిత్రాత్మకంగా, స్మాల్-క్యాప్ రాబడులు ఉధృతంగా వచ్చాయి. కాబట్టి ఈ రోజు పట్టికలో అగ్రస్థానంలో ఉన్న ఫండ్, కొన్ని నెలల తర్వాత అక్కడ ఉండకపోవచ్చు. ఈ ర్యాంకింగ్‌ను ఒక నిర్దిష్ట కాలం ఎలా గడిచిందో తెలిపే ఒక స్నాప్‌షాట్‌గా పరిగణించాలని నిపుణులు చెబుతున్నారు. సంవత్సరానికి 12 శాతం రాబడిని ఊహించి, ఐదేళ్లపాటు రూ.1 లక్ష పెట్టుబడి పెడితే, దాని విలువ దాదాపు రూ.1.76 లక్షలు. 15 శాతం రాబడిని ఊహిస్తే అది దాదాపు రూ.2.01 లక్షలు, 20 శాతం రాబడిని ఊహిస్తే అది సుమారు రూ.2.49 లక్షలు అవుతాయి. ఐటీ స్టాక్స్ లో పెట్టుబడులు తగ్గించుకున్న మ్యూచువల్ ఫండ్లు ఇవే..! ఈ రేట్లు కాంపౌండింగ్ ఎలా పనిచేస్తుందో చూపించడానికి ఉదాహరణలు మాత్రమేనని పేర్కొంటున్నారు. బలహీనమైన మార్కెట్లలో చారిత్రాత్మకంగా లార్జ్-క్యాప్ ఫండ్ల కంటే స్మాల్-క్యాప్ ఫండ్లు చాలా ఎక్కువగా పడిపోయాయి. కోలుకోవడానికి కొన్నిసార్లు సంవత్సరాలు పట్టింది. గరిష్ఠ స్థాయి నుంచి కనిష్ఠ స్థాయికి పతనం (బ్లాగ్) అనేది చూడవలసిన కొలమానమని, ఈ వర్గం దాని లాభాలు, నష్టాలు రెండింటిలోనూ కనిపిస్తుంది. పట్టికలో అగ్రస్థానంలో ఉన్న రెండు ఫండ్ల మధ్య ఎంపిక చేసుకోవడం కంటే, భారీ పతనం సమయంలో కూడా మీరు పెట్టుబడిని కొనసాగిస్తారా లేదా అని ముందుగానే నిర్ణయించుకోవడం ముఖ్యమని గుర్తు చేస్తున్నారు. రోలింగ్ రిటర్న్స్ అనేవి కేవలం ఇటీవలి ఐదేళ్ల కాలాన్ని కాకుండా, ఒక ఫండ్ చరిత్రలో ప్రతి ఐదేళ్ల కాలాన్ని కొలుస్తాయి. ఇది ఒక పెట్టుబడిదారుడు పొందగలిగే ఫలితాల పరిధిని చూపిస్తుంది. అత్యంత క్లిష్టమైన కాలాలు దాని సాధారణ కాలానికి దగ్గరగా ఉండే ఫండ్, చాలా విస్తృతమైన స్ప్రెడ్ ఉన్న ఫండ్ కంటే ఎక్కువ నమ్మదగినదిగా ఉంటుంది. ట్రెయిలింగ్, రోలింగ్ రిటర్న్‌లను అర్థం చేసుకోవడం ద్వారా, ఒక అగ్రశ్రేణి స్థానం అనేక విండోలలో సంపాదించబడిందా లేదా కేవలం ఒకే విండోలో సంపాదించబడిందా అని తెలుస్తుంది. డైరెక్ట్, రెగ్యులర్ ప్లాన్‌లు ఖర్చులో విభిన్నంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఫండ్ లో పెట్టుబడి పెట్టే ముందు ఎక్స్‌పెన్స్ రేషియో తనిఖీ చేయడం ముఖ్యమైని వివరిస్తున్నారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# సిరీస్‌పై కన్నేసిన భారత్.. రెండో టీ20లో కివీస్‌తో ఢీ.. జట్టులో భారీ మార్పు!



న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత్ మరో కీలక పోరుకు సిద్ధమైంది. క్రైస్ట్‌చర్చ్ వేదికగా నేడు జరగనున్న రెండో టీ20 మ్యాచ్‌లో సిరీస్ కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. అయితే, ఈ మ్యాచ్‌కు ముందు భారత జట్టులో అనూహ్య మార్పు చోటుచేసుకుంది. స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ గాయం కారణంగా జట్టుకు దూరం కాగా, అతని స్థానంలో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తుది జట్టులోకి రానున్నాడు.తొలి టీ20లో పరుగుల వరద పారిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్న టీమిండియా, రెండో మ్యాచ్‌లోనూ అదే జోరు కొనసాగించాలని చూస్తోంది. ఈ క్రమంలో ఇషాన్ కిషన్ గాయపడటం జట్టుకు కొంత ఇబ్బంది కలిగించే అంశమే అయినా, యువ ప్రతిభకు అవకాశం దక్కింది. గత కొన్ని మ్యాచ్‌లుగా బెంచ్‌కే పరిమితమైన వైభవ్ సూర్యవంశీ, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టుదలగా ఉన్నాడు. అంతర్జాతీయ టీ20ల్లో ఇప్పటివరకు 8 మ్యాచ్‌లు ఆడిన వైభవ్, 186.36 స్ట్రైక్ రేట్‌తో 246 పరుగులు చేసి తన సత్తా చాటాడు. అతని దూకుడైన ఆటతీరు జట్టుకు అదనపు బలం కానుంది.వైభవ్ జట్టులోకి రావడంతో భారత బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు జరగనున్నాయి. అభిషేక్ శర్మతో కలిసి వైభవ్ సూర్యవంశీ ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశం ఉంది. దీంతో, సంజూ శాంసన్ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు రానున్నాడు. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో మిడిల్ ఆర్డర్ బలంగానే కనిపిస్తోంది. తిలక్ వర్మ, నమన్ ధిర్, నితీశ్ కుమార్ రెడ్డి వంటి ఆటగాళ్లతో జట్టు సమతూకంగా ఉంది.మరోవైపు తొలి మ్యాచ్‌లో ఓటమిపాలైన న్యూజిలాండ్ జట్టు సొంతగడ్డపై సిరీస్ సమం చేయాలని గట్టి పట్టుదలతో ఉంది. మిచెల్ శాంట్నర్ నాయకత్వంలోని కివీస్ జట్టులో ఫిన్ అలెన్, గ్లెన్ ఫిలిప్స్, డారిల్ మిచెల్ వంటి ప్రమాదకరమైన ఆటగాళ్లు ఉన్నారు.క్రైస్ట్‌చర్చ్‌లో వాతావరణం పొడిగా ఉన్నప్పటికీ, సాయంత్రం వేళల్లో మంచు ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఇది రెండోసారి బౌలింగ్ చేసే జట్టుకు సవాలుగా మారవచ్చు. టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకునేందుకే మొగ్గు చూపే ఆస్కారం ఉంది.

**భారత తుది జట్టు (అంచనా) :**

అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, నమన్ ధిర్, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్.

**న్యూజిలాండ్ తుది జట్టు (అంచనా) :**

ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్ (వికెట్ కీపర్), డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, బెవాన్ జాకబ్స్, మైఖేల్ బ్రేస్‌వెల్, మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), నాథన్ స్మిత్, మాట్ హెన్రీ, ఆడమ్ మిల్నే, లాకీ ఫెర్గూసన్.

# ఇషాన్ కిషన్ కు గాయం.. టీమిండియాలోకి యువ వికెట్ కీపర్ ఎంట్రీ




న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న భారత క్రికెట్ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. వికెట్ కీపర్-బ్యాటర్ ఇషాన్ కిషన్ గాయం కారణంగా కివీస్‌తో జరగనున్న రెండో టీ20 మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో యువ వికెట్ కీపర్ కుమార్ కుశాగ్రను జట్టులోకి తీసుకున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శుక్రవారం అధికారికంగా ప్రకటించింది.క్రైస్ట్‌చర్చ్ వేదికగా జరిగిన తొలి టీ20లో ఇషాన్ కిషన్ కుడివైపు తొడ కండరాల గాయానికి (లో-గ్రేడ్ రైట్ అడక్టర్ స్ట్రెయిన్) గురయ్యాడు. ప్రస్తుతం బీసీసీఐ వైద్య బృందం అతని పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోందని బోర్డు కార్యదర్శి దేవాజిత్ సైకియా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఇండియా-ఎ జట్టుతో కలిసి క్రైస్ట్‌చర్చ్‌లోనే ఉన్న కుమార్ కుశాగ్ర, నేరుగా భారత సీనియర్ జట్టుతో కలవనున్నాడు.తొలి మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు రావడంపై వచ్చిన ఊహాగానాలపై భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ స్పష్టత ఇచ్చాడు. “ఇషాన్‌కు గజ్జల్లో గాయం కారణంగానే బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పు చేయాల్సి వచ్చింది” అని విలేకరులకు తెలిపాడు.ఇషాన్ కిషన్ గైర్హాజరీతో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. “ఇషాన్ పూర్తిగా కోలుకోకపోతే, అతని స్థానంలో ఆడేందుకు వైభవ్ సూర్యవంశీ బలమైన పోటీదారుడు” అని కోటక్ సూచనప్రాయంగా వెల్లడించాడు. తొలి టీ20లో భారత్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించి సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది.రెండో టీ20 కోసం భారత జట్టు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), వైభవ్ సూర్యవంశీ, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), అక్షర్ పటేల్, శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, భువనేశ్వర్ కుమార్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్).

# ప్రతీక అద్భుత సెంచరీ, షఫాలీ దూకుడు.. జింబాబ్వేపై భారత్ సూపర్ ఛేజింగ్




జింబాబ్వేతో జరిగిన తొలి వన్డేలో భారత మహిళల జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ఓపెనర్ ప్రతీక రావల్ (100బి) అద్భుత శతకంతో కదం తొక్కగా, విధ్వంసకర బ్యాటర్ షఫాలీ వర్మ (64బి) మెరుపు అర్ధశతకంతో విరుచుకుపడటంతో భారత్ 9 వికెట్ల తేడాతో సునాయాసంగా గెలుపొందింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది.వడోదరలోని బీసీఏ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత భారత బౌలర్లు చెలరేగారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జింబాబ్వేను 49.5 ఓవర్లలో 197 పరుగులకే కట్టడి చేశారు. జింబాబ్వే జట్టులో బిలోవ్డ్ బిజా (62) ఒక్కరే అర్ధశతకంతో రాణించారు. భారత బౌలర్లలో యువ సంచలనం శ్రీ చరణి 23 పరుగులిచ్చి 4 వికెట్లతో సత్తాచాటగా, క్రాంతి గౌడ్ 3, దీప్తి శర్మ 2 వికెట్లు పడగొట్టారు.అనంతరం 198 పరుగుల లక్ష్య ఛేదనలో భారత జట్టు ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించింది. కెప్టెన్ స్మృతి మంధాన (32)తో కలిసి ప్రతీక రావల్ తొలి వికెట్‌కు 94 పరుగుల భాగస్వామ్యం అందించింది. మంధాన ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన షఫాలీ వర్మ తనదైన శైలిలో బ్యాట్ ఝుళిపించింది. కేవలం 33 బంతుల్లో 5 ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో 64 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. మరోవైపు, బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడిన ప్రతీక 96 బంతుల్లో 15 ఫోర్లతో తన కెరీర్‌లో అద్భుతమైన సెంచరీ పూర్తి చేసుకుంది. వీరిద్దరి దూకుడుతో భారత్ కేవలం 27.1 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.జింబాబ్వే బౌలింగ్ తేలిపోవడంతో పాటు, ఆ జట్టు ఫీల్డింగ్‌లోనూ విఫలమైంది. 45 పరుగుల వద్ద ప్రతీక ఇచ్చిన క్యాచ్‌ను జారవిడవడం వారికి ప్రతికూలంగా మారింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్.. ఇలా అన్ని విభాగాల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించిన భారత జట్టు, సిరీస్‌లో శుభారంభం చేసింది.



## రోమియో జూలియట్' మూవీ రొమాంటిక్ యాక్షన్ పోస్టర్

హర్షిత్, విశాఖ ధిమాన్ జంటగా నటిస్తున్న 'రోమియో జూలియట్' సినిమా థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. భార్గవ్ మాచర్ల రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ సమర్పిస్తుండగా, నవరస ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సుందీప్ ఎన్, వెంకటేశ్వరరావు చల్లగుళ్ల నిర్మిస్తున్నారు.

దసరా పర్వదినం సందర్భంగా మేకర్స్ ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. 'రోమియో జూలియట్' నవంబర్ 13న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ రొమాన్స్, యాక్షన్ అంశాల కలయికతో ఆకట్టుకుంటోంది.పోస్టర్‌లో హర్షిత్ సన్‌గ్లాసెస్ ధరించి, చేతిలో గన్‌తో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. విశాఖ ధిమాన్ ఎరుపు రంగు దుస్తుల్లో అందంగా కనిపిస్తున్నారు. చుట్టూ ముళ్ల తీగలు, ఎర్ర గులాబీలు, గాలిలో ఎగురుతున్న పూలరేకులు కనిపిస్తున్నాయి. బుల్లెట్లు పోస్టర్‌కు యాక్షన్ ఫీల్‌ను తీసుకొస్తే, గులాబీలు, ఎరుపు రంగు రొమాంటిక్ కోణాన్ని హైలైట్ చేస్తున్నాయి.

ఇప్పటికే రెబల్ స్టార్ ప్రభాస్ విడుదల చేసిన ఈ సినిమా 'స్టోరీ రివీల్' గ్లింప్స్ కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ట్యుయేషన్‌షిప్స్, క్యాజువల్ రిలేషన్‌షిప్స్, బ్రేకప్స్, యువ జంటల మధ్య మారుతున్న సంబంధాలను 'రోమియో జూలియట్' ప్రజెంట్ చేయనుంది. నేటి యువత తమ ప్రేమ సంబంధాల్లో ఎదుర్కొంటున్న అనుభవాలు, ఆలోచనలకు అద్దం పట్టే కథతో జెన్-జెడ్ ప్రేక్షకులని అలరించేలా వుంటుంది.

ఈ సినిమాలో వైవా హర్ష, సిరి హనుమంత్, ప్రసాద్ బెహరా, ప్రభాస్ శ్రీను, అజయ్ ఘోష్, అజయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

భార్గవ్ మాచర్ల, ప్రశాంత్ రాగతి కథను అందించగా, గోపీసుందర్ సంగీతం సమకూరుస్తున్నారు. అభిరాజ్ నాయర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, యువ కిరణ్ ఎడిటింగ్ . కార్తా ప్రొడక్షన్స్ ధీరజ్ పొనుగోటి, ప్రకీర్తి ఉప్పలపాటి ప్రొడక్షన్ డిజైనర్స్.

నటీనటులు: హర్షిత్, విశాఖ ధిమాన్, వైవా హర్ష, సిరి హనుమంత్, ప్రసాద్ బెహరా, ప్రభాస్ శ్రీను, అజయ్ ఘోష్, అజయ్



## రియాలిటీ' మూవీ నుంచి వీడియో సాంగ్ 'భజ గోవిందం' రిలీజ్

ప్రామిసింగ్ హీరో కిరణ్ అబ్బవరం తన ప్రతిష్టాత్మక చిత్రం 'రియాలిటీ'తో నిత్యజీవితంలోని సహజమైన భావోద్వేగాలను, మన చుట్టూ ఉండే చిన్న చిన్న ఆనందాలను అందంగా ప్రజెంట్ చేయడానికి సిద్ధమవుతున్నారు. 'క', 'కె-రాంప్' చిత్రాల విజయాలతో జోరుమీదున్న ఆయన, ఈ సినిమాకు హీరోగా నటించడంతో పాటు కథ, స్క్రీన్‌ప్లే అందించి దర్శకత్వం కూడా వహిస్తున్నారు. తన కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి నిర్మిస్తుండగా, సురేష్ యెర్రా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మేకర్స్ తాజాగా ఈ సినిమా సంగీత ప్రయాణాన్ని ప్రారంభిస్తూ తొలి పాట 'భజ గోవిందం' ఫుల్ వీడియోను విడుదల చేశారు. గతంలో విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు మంచి స్పందన లభించగా, ఈ పాట సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచుతోంది. 'రియాలిటీ' జీవితానికి ఆంథమ్‌లా నిలిచే ఈ పాట, జీవితంలోని చిన్న చిన్న విషయాల్లోనే ఆనందాన్ని వెతుక్కోవాలనే సినిమా ప్రధాన సందేశాన్ని అందంగా ఆవిష్కరిస్తోంది. భీమ్స్ సిసిరోలియో ప్రశాంతమైన, భక్తిభావంతో కూడిన మెలోడీని స్వరపరిచారు. సనారే అందించిన అర్థవంతమైన సాహిత్యం మన దగ్గర ఉన్నదానితో సంతృప్తిగా ఉండటం, మనం చేసే పనిని ప్రేమించడం, స్వయంగా ఎదగడం ఎంత ముఖ్యమో తెలియజేస్తోంది. జీవితంలోని బాధ్యతల మధ్య మన కోసం మనం కొంత సమయాన్ని కేటాయించుకోవాల్సిన అవసరాన్ని కూడా ఈ పాట గుర్తుచేస్తోంది. వైకోమ్ విజయలక్ష్మి వాయిస్ పాటకు ఆధ్యాత్మిక, ఆహ్లాదకరమైన అనుభూతిని అందించింది. సంగీతానికి తగ్గట్టుగా రూపొందించిన విజువల్స్‌లో పల్లెటూరి జీవితంలోని అందం కనిపిస్తుంది. కిరణ్ అబ్బవరం హోటల్ నడుపుతూ, స్నేహితులు, కుటుంబ సభ్యులతో విలువైన క్షణాలను ఆస్వాదించే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. ఆయన సహజమైన నటన, హావభావాలు రోజువారీ జీవితంలోని చిన్న చిన్న సంఘటనలకు ప్రత్యేకమైన అందాన్ని తీసుకొచ్చాయి. ప్రతి సన్నివేశం నిజ జీవితానికి దగ్గరగా, మనసుకు హత్తుకునేలా ఉంది. ఆకట్టుకునే సంగీతం, ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే భావోద్వేగాలతో 'భజ గోవిందం' 'రియాలిటీ' సినిమాకు తగిన ఆంథమ్‌గా నిలుస్తోంది.

# జడి సినిమా గ్లింప్స్ విడుదల..

ఒడియాలో ఘన విజయం సాధించిన 'జడి  చిత్రాన్ని మెగా ప్రొడక్షన్స్ అధినేత ఉడుగుల అశ్విని కుమార్ గౌడ్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. శ్రీయాన్ష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాజల్ రే నిర్మించిన ఈ చిత్రానికి దిబ్య జ్యోతి ఉదయ సింగ్ రచన, దర్శకత్వం వహించారు. సైలేంద్ర సమంతరాయ్, ప్రియంబద స్వైన్, ఆకాశ్ హోతా ప్రధాన పాత్రల్లో నటించగా.. సుశాంత్ దాస్ మహాపాత్ర, రబి మిశ్రా, బాలకృష్ణ నాయక్, కృష్ణ రౌత్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం కామెడీ క్రైమ్ డ్రామాగా తెరకెక్కింది. తాజాగా తెలుగు ప్రమోషన్స్‌లో భాగంగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్ చూస్తుంటే.. ఈ కథ గ్రామీణ నేపథ్యంలో సాగుతుంది. కాలేజీ యువకుల మధ్య స్నేహం, అనుబంధాలతో ప్రారంభమై.. ప్రేమకథగా మారుతూ, స్నేహితుల మధ్య తలెత్తే విభేదాలు, సంఘర్షణలను ఆసక్తికరంగా పరిచయం చేస్తుంది. ప్రేమకథకు మించి జీవితంలోని విభిన్న భావోద్వేగాలు, బంధాలను ఈ చిత్రం ఆవిష్కరించనుంది.






## 'జో జో' కాషన్ 2 సినిమా ఇంట్రెస్టింగ్ వీడియో రిలీజ్

హీరో, హీరోయిన్‌ని ప్రేమిస్తానంటాడు.. దానికి బదులుగా"పడుచు పిల్ల కానొస్తే... ఓ నాలుగు దినాలు వెనక పడి... పని కానిచ్చుకొని... పారిపోయే టైపా? ఇష్టపడిన పిల్లని దాని బాధ్యతలతో సహా పెళ్ళి చేసుకొని దాన్ని జీవితాంతం మోసెంత గుండకాయ ఉన్న మొగోడి టైపా అని" ఆ పిల్ల ప్రశ్నిస్తాది .. దానికి హీరో బదులిస్తూ.. "సత్య ప్రమాణికంగా చెబుతున్నా ఒకతూరి మాట ఇచ్చినానంటే మడమ తిప్పని వంశం మాది... బాలయ్య బాబు టైపు" అని హీరో గడుసుగా సమాధానం ఇస్తాడు.  హీరోయిన్ మరి హీరోని ప్రేమిస్తాదా! అని తెలియాలంటే మాత్రం 'జో జో' సినిమా చూడాల్సిందేనంటున్నారు మేకర్స్. కృష్ణ కమల్ , మహి హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న రూరల్ కామెడీ డ్రామా 'జో జో'. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రముఖ దర్శకుడు దేవకట్టా సమర్పణలో కిరణ్ జయ్ కుమార్ దర్శకుడిగా రూపొందుతోంది. విజయం బ్యానర్‌పై విజయ్ కృష్ణ లింగమనేని ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THIRUMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040